ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -327 పేజీలు - 08 వెల - 04/- శనివారం18 అక్టోబర్ 2025

# NMD అంటేనే ఒక బ్రాండ్..

**నమ్మకం మంచితనం ధైర్యం..! రాజకీయంలో మచ్చ లేని మంచి మనిషి మంత్రి ఎన్.ఎం.డి.ఫరూక్.!**

- తెలుగుదేశం పార్టీకి బ్రాండ్ అంబాసిడర్ గా నిలిచిన మంత్రి ఫరూక్. ● రాజకీయ త్యాగాలకు ప్రతిరూపం ఫరూక్.
- రాజకీయాల్లో నాలుగు సార్లు గెలుపొంది● నాలుగు సార్లు మంత్రిపదవులు● టీడీపీ పార్టీకి విధేయుడు.
- ఆయన ఎక్కడ ఉంటే అక్కడే అదృష్టం. ● ఎన్నో మంత్రి పదవులు పొందినా... గర్వంలేని వ్యక్తి.
- వయసు 75 అయినా... 25 సం"ల యువకుల వలె ఉత్సాహం. ● తండ్రికి తగ్గ తనయులు.ఫిరోజ్...ఫయాజ్.

3లో



# ఖనిజ సంపదపై అధ్యయనం



**మైనింగ్ లీజుల్లో వడ్డెరలకు 15 శాతం రిజర్వేషన్లు**

- సీనరేజ్, ప్రీమియంలో 50 శాతం రాయితీ ఇవ్వాలని నిర్ణయం
- రాష్ట్ర ఖనిజ సంపదపై పూర్తిస్థాయి అధ్యయనానికి సీఎం ఆదేశం
- గనుల తవ్వకాలపై శాటిలైట్, డ్రోన్లతో పటిష్ఠ నిఘా
- ఉచిత ఇసుక విధానం సామాన్యుడికి చేరేలా చూడాలని స్పష్టం
- పెండింగ్‌లో ఉన్న 6,500 మైనింగ్ దరఖాస్తులకు గ్రీన్ సిగ్నల్



**అమరావతి,,అక్టోబర్ 17,ఆంధ్ర ప్రగతి:** రాష్ట్రంలో వడ్డెర సామాజిక వర్గానికి ఆర్థికంగా చేయూతనిచ్చే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. మైనింగ్ లీజుల కేటాయింపులో వారికి 15 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు అవసరమైన విధానాన్ని తక్షణమే రూపొందించాలని గనుల శాఖ అధికారులను ఆదేశించారు. సీనరేజి, ప్రీమియం వంటి చెల్లింపుల్లో వారికి 50 శాతం రాయితీ ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ అంశంపై పూర్తి ప్రతిపాదనలు సిద్ధం చేసి, తదుపరి కేబినెట్ సమావేశంలో చర్చకు తీసుకురావాలని సూచించారు.

శుక్రవారం సచివాలయంలో గనులు, భూగర్భ వనరుల శాఖ, ఉచిత ఇసుక విధానంపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. మిగతా 2లో...

# కార్పొరేట్ కి ధీటుగా ప్రభుత్వ స్కూళ్ళు

**ప్రభుత్వ బడుల్లో పాలు, అల్పాహారం**

**వచ్చే ఏడాది జూన్ నుంచి అమలు**

**నర్సరీ నుంచి 4వ తరగతి వరకు పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించాలి**

**ప్రణాళికలు సిద్ధం చేయండి : అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం**



హైదరాబాద్ **,అక్టోబర్ 17,ఆంధ్ర ప్రగతి:** రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాలు, అల్పాహారంతోపాటు మధ్యాహ్న భోజనం అందించేలా ప్రణాళికలను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాది జూన్ నుంచి అమలు చేసేలా కార్యాచరణ ప్రణాళికతో ముందుకెళ్లాలని కోరారు. విద్యాశాఖ ఉన్నతాధికారులతో శుక్రవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారులు కె కేశవరావు, వేం నరేందర్‌రెడ్డి, మిగతాది 2లో...

# టీటీడీ ఈవోపై హైకోర్టు సీరియస్

**తిరుమల పరకామణి చోరీ కేసుపై హైకోర్టులో విచారణ**

**కౌంటర్ దాఖలు చేయకపోవడంతో ఈవోపై ఆగ్రహం**

**ఈ నెల 27న వ్యక్తిగతంగా హాజరుకావాలంటూ ఈవోకు ఆదేశం**




2లో.

# ఉప్పాడ మత్స్యకారుల జీవితాల్లో మార్పు



**వందరోజుల ప్రణాళిక అమలుపై సమీక్ష**

**జాలర్లకు మేలు చేసే నిర్ణయాలపై పవన్ ఆరా**

**అమరావతి,,అక్టోబర్ 17,ఆంధ్ర ప్రగతి:** ఉప్పాడ తీర ప్రాంత గ్రామాల మత్స్యకారుల జీవితాల్లో మెరుగైన మార్పులు తీసుకు రావడానికి కృషి చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు.. మత్స్య సంపద పెంపొందించడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. మత్స్యకారుల సమస్యలపై శుక్రవారం) పవన్ కల్యాణ్ తన క్యాంపు కార్యాలయంలో వంద రోజుల ప్రణాళిక అమలుపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మత్స్యశాఖ ఉన్నతాధికారులతో పాటు సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సీఎంఎఫ్ఆర్ఐ), విశాఖపట్నం శాస్త్రవేత్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు.



# గుజరాత్‌లో కొలువుదీరిన కొత్త మంత్రివర్గం

**26మంది కొత్త మంత్రుల ప్రమాణం**

**క్రికెటర్ రవీంద్ర జడేజా భార్య రివాబా జడేజాకు చోటు**

గాంధీనగరం,**అక్టోబర్ 17,ఆంధ్ర ప్రగతి:** గుజరాత్‌లో కేబినేట్‌ను పునర్వ్యవస్థీకరించారు. ముఖ్యమంత్రి మినహా మిగతా మంత్రులంతా రాజీనామా చేయడంతో శుక్రవారం నూతన క్యాబినెట్ ఏర్పాటు అయింది. గాంధీ నగర్‌లో శుక్రవారంమిగతాది 2లో...



2లో.

# నేడు రాష్ట్ర బంద్

**42 శాతం రిజర్వేషన్ల కోసం బీసీ జేఏసీ పిలుపు**

**సకల జనులు పాల్గొనాలి.. బీసీల ఆకాంక్ష ఢిల్లీకి వినిపించాలి**

**అన్ని రాజకీయ పార్టీలు, సామాజిక, ప్రజాసంఘాల మద్దతు**

# ధాన్యం కొనుగోళ్లు 27 నుంచి

**51 లక్షల టన్నుల సేకరణ లక్ష్యం**

**48 గంటల్లోగా రైతుల ఖాతాల్లో డబ్బు**

**రైస్ మిల్లర్లతో భేటీలో మంత్రి నాదెండ్ల మనోహర్**

**అమరావతి,,అక్టోబర్ 17,ఆంధ్ర ప్రగతి:** రాష్ట్రంలో ఈనెల 27 నుంచి ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించనున్నట్లు పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 3,013 రైతు సేవా కేంద్రాలు, 2,061 ధాన్యం కొనుగోలు కేంద్రాలు, మొత్తం 10,700 మంది సిబ్బందితో ధాన్యం సేకరణకు సిద్ధమవుతున్నట్లు పేర్కొన్నారు. మిగతా 2లో...



# 'ఇండియా' అన్‌స్టాపుబుల్

**కాంగ్రెస్ హయాంలో కుప్పలు, తెప్పలుగా నిరర్థక ఆస్తులు.. మోదీ**



2లో.

# నేడు తెలంగాణ బంద్

## 42 శాతం రిజర్వేషన్ల కోసం బీసీ జేఏసీ పిలుపు

హైదరాబాద్ **అక్టోబర్ 17,ఆంధ్ర ప్రగతి:**
బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ జేఏసీ శనివారం రాష్ట్రబంద్‌కు పిలుపునిచ్చింది. సకల జనులు ఈ బంద్‌లో పాల్గొనాలని విజ్ఞప్తి చేసింది. బీసీల ఆకాంక్షలు ఢిల్లీకి వినిపించేలా నిర్వహించనున్నట్టు ప్రకటించింది. ఈ బంద్‌కు మద్దతునివ్వాలంటూ అన్ని రాజకీయ పార్టీలనూ బీసీ జేఏసీ ప్రతినిధులు కలిసి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రబంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. అన్ని రాజకీయ పార్టీలూ ఈ బంద్‌కు మద్దతును ప్రకటించాయి. బీసీ బిల్లును అడ్డుకుంటున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడితేనే మద్దతు ఇస్తామనీ, బంద్‌లో పాల్గొంటామని సీపీఐ(ఎం) స్పష్టం చేసింది. దానిలో భాగంగానే శుక్రవారం రాజ్‌భవన్ ముట్టడిని చేపట్టింది. బిల్లుకు అడ్డుపడుతున్న బీజేపీ కూడా ఈ బంద్‌కు మద్దతు ఇవ్వడం గమనార్హం. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు, గవర్నర్ వ్యవహారశైలికి నిరసనగా శనివారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు, బైక్ ర్యాలీలు నిర్వహిస్తున్నట్టు ప్రకటించింది. రాష్ట్రబంద్ నేపథ్యంలో ప్రయివేటు పాఠశాలలు, కాలేజీ యాజమాన్యాలు స్వచ్ఛందంగా సెలవులు ప్రకటించాయి.
రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తామంటూ కామారెడ్డి డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో హామీ ఇచ్చింది. అందుకనుగుణంగా బీసీల రిజర్వేషన్లకు సంబంధించి అసెంబ్లీలో బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపించింది. ఆర్నెల్లైనా కేంద్ర ప్రభుత్వం ఆమోదించలేదు. అయితే రాష్ట్ర మంత్రివర్గం ఆర్డినెన్స్‌ను ఆమోదించి గవర్నర్‌కు పంపించింది. దాన్ని కూడా కేంద్ర ప్రభుత్వానికి పంపించారు. ఆర్డినెన్స్‌పైనా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. బీసీ రిజర్వేషన్ల బిల్లు, ఆర్డినెన్స్‌పై కేంద్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ జీవో నెంబర్ తొమ్మిదిని విడుదల చేసింది. ఆ జీవో ఆధారంగా రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించింది. ఆ జీవోను సవాల్ చేస్తూ రెడ్డి జాగృతి హైకోర్టును ఆశ్రయించింది. ఇరు పక్షాల వాదనలు విన్న హైకోర్టు జీవో నెంబర్ తొమ్మిదిపై స్టే విధించింది. దీంతో స్థానిక సంస్థల ఎన్నికలు ఆగిపోయాయి. హైకోర్టు స్టేను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్‌లీవ్ పిటిషన్ (ఎస్‌-ఎల్‌పీ)ని దాఖలు చేసింది.
అయితే సుప్రీంకోర్టు ఆ స్టేను సమర్థించింది. ఎస్‌-ఎల్‌పీని తిరస్కరించింది. ఈ నేపథ్యంలో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో శనివారం తలపెట్టిన రాష్ట్రబంద్‌కు ప్రాధాన్యత సంతరించుకుంది. కాంగ్రెస్, బీజేపీ మద్దతు ఇస్తుండడంతో బీసీ రిజర్వేషన్లకు అడ్డుగా ఉన్నది ఎవరు?అనే ప్రశ్న అందరిలోనూ తలెత్తుతున్నది. రాష్ట్రబంద్ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకమా?, రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకమా? లేదంటే కోర్టులకు వ్యతిరేకమా?అని బీసీ జేఏసీని పలువురు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం డెడికేషన్ కమిషన్ ద్వారా కులగణన చేపట్టి దాని ఆధారంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ఇవ్వాలని నిర్ణయించింది. అందులో భాగంగానే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించింది. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద కాంగ్రెస్ పార్టీ ధర్నా చేపట్టింది. కేంద్రం ఆమోదించకపోవడం వల్లే రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ తొమ్మిదిని విడుదల చేసింది. హైకోర్టు స్టేపై సుప్రీంకోర్టును ఆశ్రయించింది.
బీసీలకు రిజర్వేషన్లను కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నదని పలు రాజకీయ పార్టీలు, బీసీ సంఘాలు చెప్తున్నాయి. అయితే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించాలన్న బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదించాలి. లేదంటే పార్లమెంటులో బిల్లు ఆమోదించి రాజ్యాంగంలో తొమ్మిదో షెడ్యూల్‌లో బీసీ రిజర్వేషన్లను చేరిస్తే శాశ్వత పరిష్కారం లభిస్తుందని బీసీ మేధావులు సూచిస్తున్నారు. అసెంబ్లీలో బీసీ బిల్లును ఆమోదించిన బీజేపీ కేంద్రంలో మాత్రం ఆ పని చేయకుండా అడ్డుకుంటుండడం గమనార్హం. ఇప్పుడు బీసీ రిజర్వేషన్లకు సంబంధించి బంతి కేంద్ర ప్రభుత్వంలో ఉన్నది. కేంద్రం ఆమోదిస్తేనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలవుతాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఢిల్లీకి తీసుకెళ్లాలని పలు రాజకీయ పార్టీలు కోరుతున్నాయి.

## కార్పొరేట్ కి ధీటుగా ప్రభుత్వ స్కూళ్ళు

**(మొదటి పేజీ తరువాయి)**
సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, ఉన్నత విద్యామండలి చైర్మెన్ వి బాలకిష్టారెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా, కళాశాల, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణఆదిత్య, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈ నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ పేదలకు మెరుగైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రకటించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతుల కల్పన కోసం ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులను కోరారు. తొలి దశలో ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్‌పై దృష్టిసారించాలని సూచించారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ స్కూల్ తరహాలో తీర్చిదిద్దాలని చెప్పారు. ఆటస్థలం, అవసరమైన తరగతి గదులతో పాటు మంచి వాతావరణం ఉండేలా పాఠశాలలుం డాలని అన్నారు. ఇందుకు విద్యాశాఖ పరిధిలో ఉన్న స్థలాలను గుర్తించాలని ఆదేశించారు. సరైన సౌకర్యాల్లేని పాఠశాలలను దగ్గరలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలానికి తరలించాలని కోరారు. నర్సరీ నుంచి నాలుగో తరగతి వరకు నూతన స్కూల్స్‌ను పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించాలని చెప్పారు.

## గుజరాత్‌లో కొలువుదీరిన కొత్త మంత్రివర్గం

**(మొదటి పేజీ తరువాయి)**
26 మంది సభ్యుల కొత్త మంత్రివర్గం ప్రమాణ స్వీకారం చేసింది. గవర్నర్ వీరితో ప్రమాణం చేయించారు. వారిలో క్రికెటర్ రవీంద్ర జడేజా భార్య, గుజరాత్ ఎమ్మెల్యే రివాబా జడేజా కూడా ఉన్నారు. గురువారం ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మినహా గుజరాత్ మంత్రులందరూ తమ రాజీనామాలను సమర్పించారు. వ్యవస్థాగత, రాజకీయ సవాళ్లను ఎదుర్కొనే లక్ష్యంతో రాష్ట్ర క్యాబినెట్‌ను పునర్వ్యవస్థీకరించాలనే ప్రణాళికలో భాగంగా ఈ రాజీనామా పక్రియ చోటుచేసుకున్నట్లు పార్టీ నేతలు మీడియాకు వెల్లడించారు. గుజరాత్ అసెంబ్లీలో సభ్యుల సంఖ్య 182. నిబంధన ప్రకారం.. మంత్రుల సంఖ్య 27 వరకు ఉండొచ్చు. 1990లో రాజ్‌కోట్‌లో జన్మించిన రివాబా ఆత్మియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. 2016 ఏప్రిల్ 17న భారత క్రికెటర్ రవీంద్ర జడేజాను వివాహం చేసుకున్నారు. 2019లో భాజపాలో చేరారు. 2022 గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో జామ్‌నగర్ నార్త్ నుంచి పోటీ చేసి గెలుపొందారు. రాజ్‌పుత్ వర్గానికి చెందిన ఆమె కమలదళంలో చేరడానికి ముందు 2018లో కర్ణిసేన మహిళా విభాగానికి చీఫ్‌గా వ్యవహరించారు.

## భారీ సరెండర్

**రాయపూర్,అక్టోబర్ 17,ఆంధ్ర ప్రగతి:**
:మావోయిస్టు అగ్రనేత, పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు తక్కళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న అలియాస్ రూపేష్ పోలీసుల ముందు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో ఆశన్న సహా 208 మంది మావోయిస్టులు ఉన్నారు. మావోయిస్టు చరిత్రలో ఇదే అతిపెద్ద లొంగుబాటు. వారిలో 110 మంది మహిళలు, 98 మంది పురుషులు ఉన్నారు. 153 ఆయుధాలు అప్పగించగా.. వీటిల్లో 19 ఏకే-47 రైఫిళ్లు, 17 ఎస్ఎల్ఆర్ రైఫిళ్లు, 23 ఇన్సాస్‌లు, 1 ఇన్సాస్ ఎల్ఎంజీ, 303 రైఫిళ్లు, 11 బీజీఎల్, నాలుగు కార్బైన్‌లు, 41 బోర్ షాట్‌గన్‌లు, పిస్తోళ్లు ఉన్నాయి. ఈ లొంగుబాటుపై ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్ మాట్లాడారు. ఇది ఛత్తీస్‌గఢ్‌కే కాదు దేశం మొత్తానికి చరిత్రాత్మకమైన రోజు. హింసను వీడి జన జీవన స్రవంతిలో కలిసిపోవాలని మేం వారిని కోరుతూ వచ్చాం. ఇప్పుడు వారికి నైపుణ్యాలు కల్పించి, పునరావాసానికి ఏర్పాటు చేస్తాం అని వెల్లడించారు. మావోయిస్టు పార్టీ అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ అభయ్ ఆయుధాలను వీడి 60 మంది ఉద్యమ సహచరులతో కలిసి జనజీవన స్రవంతిలో కలిసిన గంటల వ్యవధిలోనే ఆశన్న లొంగుబాటు ప్రకటన వచ్చింది. ఇద్దరు అగ్రనేతలు పోరాటాన్ని వీడటంతో మావోయిస్టు పార్టీకి గట్టి షాక్ తగిలింది. ఆశన్న స్వస్థలం ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని నర్సింగాపూర్ గ్రామం. నాలుగు దశాబ్దాల క్రితం పీపుల్స్‌వార్ ఉద్యమం వైపు ఆకర్షితులయ్యారు. వాసుదేవరావు ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు మండలంలోని లక్ష్మీదేవిపేట ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం చేశారు. అనంతరం అప్పటి హనుమకొండ మండలం కాజీపేటలోని ఫాతిమా స్కూల్‌లో సెకండరీ విద్యనభ్యసించారు. కాకతీయ వర్సిటీలో డిగ్రీ చదువుతూ రాడికల్ స్టూడెంట్ యూనియన్(ఆర్ఎస్‌యూ)కు నాయకత్వం వహిస్తూ ఆ తర్వాత పరిణామాల నేపథ్యంలో 25 ఏళ్ల వయసులోనే అజ్ఞాతంలోకి వెళ్లారు. ప్రస్తుతం వాసుదేవరావు వయసు 60 ఏళ్లు పైబడి ఉంటుందని ఇంటెలిజెన్స్ వర్గాలు భావిస్తున్నాయి. కీలక దాడులకు ఆశన్న వ్యూహకర్త. దండకారణ్య సబ్‌జోనల్ బ్యూరో కార్యదర్శిగా రూపేశ్ పేరుతో వ్యవహరించిన ఆశన్న.. ఏపీ సీఎం చంద్రబాబు, మాజీ సీఎం నేదురుమల్లి జనార్దనరెడ్డిలపై బాంబులు పేల్చి హత్యాయత్నం, 1999లో ఐపీఎస్ అధికారి ఉమేశ్‌చంద్ర హత్య, 2000లో నాటి హోంమంత్రి మాధవరెడ్డి హత్య లాంటి ఘటనలకు నేతృత్వం వహించినట్లు చెబుతారు.

## టీటీడీ ఈవోపై హైకోర్టు సీరియస్

**అమరావతి,అక్టోబర్ 17,ఆంధ్ర ప్రగతి:**
తిరుమల పరకామణిలో జరిగిన భారీ చోరీ కేసుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీవ్రంగా స్పందించింది. ఈ వ్యవహారంలో ఇప్పటివరకు కౌంటర్ దాఖలు చేయకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయస్థానం, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కార్యనిర్వహణాధికారి (ఈవో) వ్యక్తిగతంగా హాజరు కావాలని కఠిన ఆదేశాలు జారీ చేసింది.శుక్రవారం ఈ కేసు విచారణ సందర్భంగా, టీటీడీ అధికారుల తీరుపై న్యాయమూర్తి అసహనం ప్రదర్శించారు. కౌంటర్ దాఖలు చేయడంలో జాప్యంపై ప్రశ్నించారు. ఈ నెల 27న జరిగే తదుపరి విచారణకు ఈవో కచ్చితంగా హాజరుకావాలని, లేనిపక్షంలో రూ. 20 వేల జరిమానా విధించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కౌంటర్ దాఖలు చేసేందుకు గడువు కావాలని టీటీడీ తరఫు న్యాయవాది కోరడంతో, కోర్టు ఈ విచారణను ఈ నెల 27వ తేదీకి వాయిదా వేసింది.కోర్టు ఆదేశాల మేరకు ఈ కేసును దర్యాప్తు చేస్తున్న సీఐడీ అధికారులు, ఇప్పటికే తిరుమల పరకామణిలోని కీలక దస్త్రాలను స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తునకు సంబంధించిన ప్రాథమిక నివేదికను, సీజ్ చేసిన ఫైళ్లను శుక్రవారం కోర్టుకు సమర్పించారు.గతంలో రవికుమార్ అనే ఉద్యోగి పరకామణిలో భారీగా అవకతవకలకు పాల్పడినట్లు 2023లో ఆరోపణలు వచ్చాయి. అయితే, అప్పటి వైసీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీ అధికారులు ఈ అంశంపై పూర్తిస్థాయి విచారణ జరపకుండా లోకాయుక్త ద్వారా రాజీ కుదిర్చారని ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో, శ్రీనివాసులు అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయడంతో న్యాయస్థానం ఈ కేసును సీరియస్‌గా తీసుకుని విచారణ జరుపుతోంది.

## ధాన్యం కొనుగోళ్లు 27 నుంచి

**(మొదటి పేజీ తరువాయి)** రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై చర్చించేందుకు శుక్రవారం ఆయన రాష్ట్ర రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో విజయవాడలో సమావేశమయ్యారు. మంత్రి మనోహర్ మాట్లాడుతూ.. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 51 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్న ప్రభుత్వ లక్ష్య సాధన కోసం మిల్లర్లు పనిచేయాలని కోరారు. బ్యాంక్ గ్యారంటీలు 1:2 ఏర్పాటు చేస్తామని, ఇందుకోసం 35బ్యాంకుల సేవలను ఉపయోగించుకోవచ్చని వివరించారు. ధాన్యం విక్రయించిన 24 గంటల నుంచి 48 గంటల్లోగా రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తామని వెల్లడించారు. కాగా, ఆర్థిక ఇబ్బందులున్నప్పటికీ.. గత ప్రభుత్వం పెట్టిన రూ.1,674 కోట్ల బకాయిలు, మిల్లర్లకు చెల్లించాల్సిన రూ.763 కోట్లను కూటమి ప్రభుత్వం చెల్లించిందని మంత్రి మనోహర్ గుర్తుచేశారు. రైతుల కోసం కలిసి పనిచేద్దామని మిల్లర్లకు పిలుపునిచ్చారు. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టడంలో రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి తోడుగా నిలవాలని కోరారు. ఈ సమావేశానికి రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, కార్యదర్శి వల్లూరి సూర్యప్రకాశరావు, కోశాధికారి రంగయ్యనాయుడు, 26 జిల్లాల రైస్‌మిల్లర్స్ ప్రతినిధులు హాజరయ్యారు.

## ఉప్పాడ మత్స్యకారుల జీవితాల్లో మార్పు

**(మొదటి పేజీ తరువాయి)**
ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై పవన్ కల్యాణ్ చర్చించారు. మత్స్యకారుల్లో చేపల వేట సామర్థ్యాన్ని మరింత పెంపొందించడానికి గల అవకాశాలు, మత్స్యకారులకు అదనపు ఆదాయం సముపార్జనకు తీసుకోవాల్సిన చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ఇటీవల కాకినాడ పర్యటన సందర్భంగా పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని ఉప్పాడ తీర ప్రాంత గ్రామాల మత్స్యకారులు తమ సమస్యలని పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యల పరిష్కారానికి వందరోజుల ప్రణాళిక చేపట్టారు. ఈ ప్రణాళికలో భాగంగా ఇప్పటి వరకు తీసుకున్న చర్యలపై ఈ సమీక్షలో చర్చించారు. ఉప్పాడ తీర ప్రాంత మత్స్యకార గ్రామాల్లో సదుపాయాలు కల్పించడంతోపాటు వారి జీవనోపాధిని మెరుగుపర్చేందుకు ఉన్న అవకాశాలని అన్వేషించాలని సూచించారు. ముఖ్యంగా చేపల వేటలో మెలకువలు నేర్పడం, నైపుణ్యం పెంచడంతోపాటు తగిన సౌకర్యాల కల్పనపైనా దృష్టి



సారించాలని పవన్ కల్యాణ్ దిశానిర్దేశర చేశారు. వీటితోపాటు మత్స్య సంపదను పెంపొందించడం, తదితర అంశాలపై విశాఖపట్నం సీఎంఎఫ్ఆర్ఐ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జోయ్ కె. కిజాకుడాన్ సలహాలు, సూచనలు తీసుకున్నారు. యన సూచనలను అమలు చేయడానికి గల అవకాశాలను పరిశీలించాలని కాకినాడ జిల్లా కలెక్టర్‌కి పవన్ కల్యాణ్ సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణ తేజ, మత్స్య శాఖ కమిషనర్ రామశంకర్ నాయక్, కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి, ఎస్పీ బిందు మాధవ్, పడా ప్రాజెక్ట్ డైరెక్టర్ చైత్ర వర్షిణి తదితరులు పాల్గొన్నారు.

--------------

## 'ఇండియా' అన్‌స్టాపుబుల్

**న్యూఢిల్లీ,అక్టోబర్ 17,ఆంధ్ర ప్రగతి:**
కాంగ్రెస్ హయాంలో కుప్పతెప్పలుగా నిరర్థక ఆస్తులు (పేరుకుపోయేవని, బ్యాంకులకు వెళ్లాలంటేనే ప్రజలు భయపడే వారని, ప్రభుత్వ సబ్సిడీల నుంచి తప్పించుకునేందుకు రోజుకు 12 గంటలపాటు పెట్రోల్ బంక్‌లు కూడా మూసుండేవని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో శుక్రవారం నాడు జరిగిన సదస్సులో 'అన్‌స్టాపుబుల్ ఇండియా' అనే థీమ్‌పై ప్రధాని మాట్లాడారు. ఈ సదస్సులో శ్రీలంక ప్రధానమంత్రి హరిణి అమరసూర్య, యూకే మాజీ ప్రధానమంత్రి రిషి సునాక్, ఆస్ట్రేలియా మాజీ ప్రధాని టోనీ అబాట్ సహా పలువురు ప్రస్తుత, మాజీ ప్రపంచ నేతలు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ప్రధానమంత్రి మోదీ మాట్లాడుతూ, గతంలో ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయిన నిరర్థక ఆస్తుల పరిస్థితిని అదుపు చేసేందుకు తాము కార్యచరణను చేపట్టామని, బ్యాంకింగ్ రంగంలో సంస్కరణలు తెచ్చామని చెప్పారు. డిజిటల్ లావాదేవీల్లో ఇండియాను ఆర్థికంగా అత్యంత సమ్మిళిత దేశాల్లో ఒకటిగా తీర్చిదిద్దామని తెలిపారు. ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక సమ్మిళిత కార్యక్రమాల్లో ఒకటని వివరించారు.'ఒకప్పుడు పేద ప్రజలు బ్యాంకులకు వెళ్లాలంటేనే భయపడేవారు. మేము బాధ్యతలు తీసుకునేంత వరకూ దేశ జనాభాలో సగం మందికి బ్యాంకు అకౌంట్లు కూడా లేవు. బ్యాంకింక్ వ్యవస్థను మేము ప్రజాస్వామ్యీకరించాం. మిషన్ మోడ్‌లో 50 కోట్లకు పైగా జన్ ధన్ అకౌంట్లను తెరిపించాం' అని అన్నారు.ఇది పండుగల సీజన్ అని ప్రధాని మోదీ పేర్కొంటూ అందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఇలాంటి తరుణంలో 'అన్‌స్టాపబుల్ భారత్' పేరుతో ప్రపంచ సదస్సు ఏర్పాటు చేయడం సందర్భానికి తగినట్టుగా ఉందని, ఇండియా ఎక్కడా ఆగకుండా ముందుకు సాగే మూడ్‌లోనే ఉందని చెప్పారు. గత 11 ఏళ్లుగా ఇండియా ఎన్నో అవరోధాలు అధిగమించి ముందుకు వెళ్లిందని, ప్రపంచంలోని ఐదు ఆర్థిక వ్యవస్థల్లో ఒకటి నిలిచిందని చెప్పారు. ఇప్పుడు భారత్ సైలెంట్‌గా ఉండబోవడం లేదని, సర్జికల్ దాడులు, ఎయిర్‌స్ట్రైక్స్, ఆపరేషన్ సిందూర్‌తో గట్టి జవాబు ఇస్తోందని చెప్పారు. కొవిడ్ సమయంలో ఇండియా ఎలా గట్టెక్కుతుందని అంతా అనుకున్న దశలో ఆ ఆలోచన తప్పని రుజువు చేశామని చెప్పారు. సవాళ్లను ఎదుర్కొని, ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా నిలబడ్డామని అన్నారు. గత మూడేళ్లలో దేశ ఆర్థిక వృద్ధి యావరేజ్‌గా 7.8 శాతం ఉందని, రెండ్రోజుల క్రితమే ఎగుమతులు 7 శాతం పెరిగినట్టు మన ఎగుమతుల గణాంకాలకు బయటకు వచ్చాయని చెప్పారు. భారత్ వృద్ధి పెరుగుతోందని ఐఎంఎఫ్ ప్రశంసించిదని, మరుసటి రోజు గూగుల్ భారీ పెట్టుబడుల ప్రకటన చేసిందని తెలిపారు. ఇంధనం, సెమీ కంటెక్టర్ల రంగంలో భారీ పెట్టుబడులు పెడుతున్నారని చెప్పారు. యూకే ప్రధాని స్టార్మర్ అతిపెద్ద ప్రతినిధి బృందంతో ఇండియాకు వచ్చారని, ఇండియాలో అవకాశాలను ప్రపంచం గుర్తించిందని, బాధ్యత గల భాగస్వామిగా ప్రపంచం భారత్‌ను చూస్తోందని చెప్పారు.

## ఖనిజ సంపదపై అధ్యయనం

**(మొదటి పేజీ తరువాయి)**
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వడ్డెర్లకు లీజులు కేటాయించడమే కాకుండా, వారిని ఎంఎస్ఎంఈలుగా ప్రోత్సహించేలా ప్రస్తుత పాలసీలతో అనుసంధానం చేయాలని దిశానిర్దేశం చేశారు.వెనుకబడిన వర్గాలైన వడ్డెర్లకు ఆర్థిక ప్రయోజనాలు కలిగేలా లీజు కేటాయింపు విధానాన్ని రూపొందించాలని సీఎం స్పష్టం చేశారు. మైనింగ్ లీజుల కేటాయింపుతో పాటు వారు ఎంఎస్ఎంఈలుగా ఎదిగేందుకు కూడా ప్రస్తుతం ఉన్న పాలసీని అనుసంధానించాలని అన్నారు.
ఇక, ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానం ద్వారా ప్రజలందరికీ ప్రయోజనం కలగాలని సీఎం స్పష్టం చేశారు. దీనికి అనుగుణంగా ఉచిత ఇసుక సరఫరాను సమర్థవంతంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వ్యవస్థలో ఉన్న లోపాలను వినియోగించుకుని దుర్వినియోగం చేసే అవకాశం లేకుండా నిబంధనలు కఠినంగా అమలు చేయాలని సీఎం స్పష్టం చేశారు. ఈ సీజన్ కోసం 66.5 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను నిల్వ చేశామని... ప్రస్తుతం అన్ని స్టాక్ పాయింట్లలోనూ 43 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. దీనిపై సీఎం స్పందిస్తూ చిట్టచివరి వ్యక్తికీ ప్రయోజనం దక్కేలా ఇసుక లభ్యత జరగాలని అన్నారు. ఇసుక లోడింగ్ తో పాటు రవాణాకు అతితక్కువ వ్యయం అయ్యేలా చూడాలని సీఎం సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉచిత ఇసుక లభ్యతపై ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అంతర్రాష్ట్ర సరిహద్దుల్లోని అన్ని రూట్లలో పెట్టిన సీసీ కెమెరాల నిఘాను మరింత పటిష్టం చేయాలని సీఎం సూచించారు. ఆర్టీజీఎస్ ద్వారా ఉచిత పంపిణీ విధానంపై పర్యవేక్షించాలని సీఎం అన్నారు. రాష్ట్రంలో లభ్యం అవుతున్న ఖనిజాల విలువపై సమగ్ర అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు గనుల శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఖనిజాలకు విలువ జోడింపుతోనే అదనపు ఆదాయం వస్తుందని సీఎం సూచించారు. మేజర్, మైనర్ మినరల్స్ ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.3320 కోట్ల ఆదాయార్జనను లక్ష్యంగా పెట్టుకున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. గతంతో పోలిస్తే 34 శాతం మేర అదనంగా గనుల శాఖ నుంచి ఆదాయం వచ్చే అవకాశం ఉందని తెలిపారు. మాంగనీస్ లాంటి మేజర్ ఖనిజాల ఉత్పత్తిలో 72 శాతానికి పైగా ఆదాయం వస్తోందని వివరించారు. దీనిపై స్పందించిన సీఎం ఏపీలో ఉన్న మినరల్ వెల్త్ విలువను అంచనా వేయాలని సూచించారు. ఒడిశా లాంటి రాష్ట్రాల్లో వాల్యూ ఎడిషన్ ద్వారా ఎక్కువగా ఆదాయాన్ని పొందుతున్నారని.. రూ.50 వేల కోట్ల ఆదాయం ఖనిజాల నుంచే వస్తోందని సీఎం తెలిపారు. ఏపీలోనూ అందుకు తగిన విజన్ ప్లాన్ తయారు చేసి విలువ జోడిస్తే రూ.20-30 వేల కోట్ల ఆదాయాన్ని ఆర్జించే అవకాశం ఉంటుందని ముఖ్యమంత్రి అన్నారు. పెండింగ్ లో ఉన్న 6500 దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేయాలని ఆదేశించారు.

# NMD అంటేనే ఒక బ్రాండ్..



## నమ్మకం మంచితనం ధైర్యం..!

## రాజకీయంలో మచ్చ లేని మంచి మనిషి మంత్రి ఎన్.ఎం.డి.ఫరూక్.!

- తెలుగుదేశం పార్టీకి బ్రాండ్ అంబాసిడర్ గా నిలిచిన మంత్రి ఫరూక్.
- రాజకీయ త్యాగాలకు ప్రతిరూపం ఫరూక్.
- రాజకీయాల్లో నాలుగు సార్లు గెలుపొంది...నాలుగు సార్లు మంత్రిపదవులు.
- టీడీపీ పార్టీకి విధేయుడు. ..ఆయన ఎక్కడ ఉంటే అక్కడే అదృష్టం.
- ఎన్నో మంత్రి పదవులు పొందినా... గర్వంలేని వ్యక్తి.
- వయసు 75 అయినా... 25 సం"ల యువకుల వలె ఉత్సాహం.
- .ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తనదైన మార్కుతో పాలన.!
- తండ్రికి తగ్గ తనయులు. ఫిరోజ్...ఫయాజ్.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 17:**

రాజకీయాల్లో రాణించాలంటే కుళ్ళ,కుతంత్రాలు,ఒకరిని అణగదొక్కుతే కానీ పైకి రాని పరిస్థితి రాజకీయం.రాజకీయాల్లో పదవులు పొందాలంటే ఓర్పు,సహనం,మంచి పేరు ఉంటే కానీ పదవులు రావడం కష్టం.రాజకీయాల్లో గెలిచిన ప్రతి సారి మంత్రి పదవులు పొందడం కోటిలో ఒక్కరికే దక్కుతుంది.మంత్రి పదవులు ఒక్క సారి రావాలంటే రాజకీయంలో ఎంతో పేరు,అదృష్టం ఉంటే కానీ రాణి పరిస్థితి.గెలిచిన ప్రతి సారి మంత్రి పదవులు వస్తున్నాయంటే పార్టీలో ఆ నాయకునికి ఉన్న పేరు ఆషామాషీ కాదు.పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీని నమ్ముకొని పార్టీ ఆదేశాలను తూ చా తప్పకుండా పాటిస్తూ అవకాశాలు ఉన్నా పార్టీ ఆదేశాల మేరకు త్యాగాలు చేసిన నాయకులు ఎవరంటే రాష్ట్ర న్యాయ,మైనార్టీ శాఖామాత్యులు ఎన్.ఎం.డి.ఫరూక్ ఒకే ఒక్కడు...దేశ వ్యాప్తంగా రాజకీయంగా నంద్యాల కు మంచి పేరు ఉంది.నంద్యాల నుంచి రాష్ట్రపతి,ప్రధాన మంత్రి,మంత్రులు,ఎమ్మెల్యే లుగా ఎందరో గెలుపొంది దేశ స్థాయిలో మంచి గుర్తింపు పొందారు.రాజకీయాల్లో రాణించాలంటే డబ్బు,ధైర్యం,మంచి తనం, ఓర్పు,నమ్ముకున్న సిద్ధాంతం,పార్టీకి విధేయులుగా ఉంటేనే రాజకీయంలో రాణిస్తారు.ఎన్నికల్లో గెలిచిన ప్రతి సారి మంత్రి పదవులు పొంది హ్యాట్రిక్ సాధిస్తున్న కాసింత హుందా తనం లేకుండా సాదారణ జీవితం గడిపే వారు కొందరే.ఎదిగే కొద్ది ఓధగాలని పెద్దలు చెప్పిన సామెతకు నిలువెత్తు నిదర్శనం ఎన్.ఎం.డి.ఫరూక్.పార్టీలో మంచిపేరు తెచ్చుకుంటూ మంత్రి పదవులు పొందినా గర్వం,దర్పం ప్రదర్శించకుండా రాష్ట్ర అధినేతలతో పాటు సాక్షాత్తు దేశ ప్రధాని నరేంద్ర మోదీ సైతం కర్నూలు జిల్లా నన్నూరు లో జరిగిన బహిరంగ సభలో స్టేజి మీద మంత్రి ఎన్.ఎం.డి.ఫరూక్ ను పిలిచి కరచాలనం చేయడం విశేషం.రాజకీయాల్లో మచ్చలేని వారికి మాత్రమే ఇలాంటి అద్భుత అవకాశాలు లభిస్తాయని మేధావులు పేర్కొంటున్నారు.నంద్యాల నియోజకవర్గంలో 1981 జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసి కౌన్సిలర్ గా ఎన్నికై రాజకీయాల్లో ముద్ర వేశారు.పెద్ద కుటుంబంలో జన్మించిన అందరితో కలుపుకొని వెళ్ళడంతో రాజకీయంగా మంచి పేరు తెచ్చుకున్నారు.చిన్న తనం నుంచే సినీ నటుడు నందమూరి తారక రామారావు వీరాభిమాని.ఆయన సినిమాలు విడుదల అయ్యాయి అంటే రాత్రి నుంచి స్నేహితులతో కలిసి మొదటి ఆట చూడాల్సిందే.సినీ రంగం నుంచి 1983 లో నందమూరి తారక రామారావు రాజకీయాల్లోకి అడుగుపెట్టడంతో ఫరూక్ కు ఊహించని పిలుపు వచ్చింది.సాక్షాత్తు అన్న పిలుపుతో అక్కడికి చేరుకొని అన్న చెప్పిన మాట కాసేపు నోట్లో మాటరాలేదు.నంద్యాల ఎమ్మెల్యే గా పోటీ చేసేందుకు టికెట్టు ఇస్తున్న వెళ్లి అందరిని కలుపుకొని వెళ్ళి ధైర్యంగా నిలబడు నేనున్నాను అంటూ అభయం ఇవ్వడంతో ఉక్కిరిబిక్కిరి అయ్యి నంద్యాల తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా గెలుపొందారు.గెలిచిన వెంటనే మరో ఊహించని షాకింగ్ న్యూస్ ఫరూక్ ఆనందంలో ముంచెత్తింది.టీడీపీ జన విజయం సాధించడంతో ఆయన మంత్రి వర్గంలో ఫరూక్ కు మంత్రి పదవి లభించింది.అక్కడి నుంచి జరిగిన రాజకీయ ,నాటకీయ పరిణామాలు ఎన్నో జరిగినా టీడీపీని నమ్ముకున్నారు.తెలుగుదేశం పార్టీ అధినేత మార్పు జరగడం నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావడం ఆయన హయంలో సైతం మరో రెండు సార్లు గెలుపొంది మంత్రి పదవులు పొందారు.డిప్యూటీ స్పీకర్ పదవి చేసి హుందాగా వ్యవహరించారు.రాజకీయాల్లో ఆటుపోట్లు తప్పవు అన్నట్టు 2004 లో క్రిస్ పార్టీలోకి శిల్పా మోహన్ రెడ్డి రంగ ప్రవేశం చేశారు.ఆ ఎన్నికల్లో టీడీపీ పార్టీ నుంచి ఫరూక్,కాంగ్రెస్ పార్టీ నుంచి శిల్పా మోహన్ రెడ్డి పోటీలో నిలబడ్డారు.రాజకీయాల్లో విలువలు,అభివృద్ధి కంటే డబ్బే ప్రధానమని ఎస్ ఎన్నికల్లో నిజమైంది. నంద్యాల రాజకీయాల్లో ఎన్నడు లేనివిధంగా ఓటుకు నోటు ఇవ్వడంతో ప్రజలు అన్ని మరచిపోయి ఓటు కు 300 ఇచ్చిన వారికి వేసి భారీ మెజారిటీ తో శిల్పా మోహన్ రెడ్డి నీ గెలిపించారు.నటి నుంచి రాజకీయాలంటే ఖరీదుగా మారిపోయాయి.రాష్ట్ర వ్యాప్తంగా ఈ సంస్కృతి బీజం పడింది.రాజకీయంలో ఓటమి పాలైనా ప్రజల సమస్యలు పరిష్కరిస్తూ నెట్టుకొచ్చేవారు.తెలుగుదేశం పార్టీ అధిష్టానం 2009 ఎన్నికల్లో నంద్యాల తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ఎన్.హెచ్.భాస్కర్ రెడ్డి కి టికెట్ ఇవ్వడంతో ఆయన విజయానికి సహకరించాలని చెప్పడంతో పార్టీ ఆదేశాలను పాటించారు.ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి శిల్పా మోహన్ రెడ్డి,టీడీపీ నుంచి ఎన్.హెచ్.భాస్కర్ రెడ్డి,ప్రజా రాజ్యం పార్టీ నుంచి ఏవీ సుబ్బారెడ్డి పోటీలో నిలబడ్డారు.ఆ ఎన్నికల్లో సైతం ఓటుకు 500 పెంచడంతో మరో సారి శిల్పా మోహన్ రెడ్డి గెలుపొందారు.విధి వక్రీకరించడంతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో మృతిచెందారు.రాజకీయాల్లో పెను మార్పులు సంభవించడంతో వైఎస్సార్ తనయుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాజకీయాల్లోకి వచ్చి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పెట్టడంతో 2014 లో ఆ పార్టీలో భూమా నాగిరెడ్డి చేరడంతో శిల్పా మోహన్ రెడ్డి తెలుగుదేశం పార్టీలో చేరారు.రెండవసారి సైతం అధిష్టానం ఎస్ ఎన్నికల్లో ఫరూక్ ను బుజ్జగించి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా శిల్పా మోహనరెడ్డి పేరు ప్రకటించడంతో ఆ ఎన్నికల్లో సైతం పార్టీ ఆదేశాలు పాటించారు. ఆ ఎన్నికల్లో భూమా నాగిరెడ్డి గెలుపొందారు.2017 లో భూమా నాగిరెడ్డి గుండెపోటుతో మృతిచెందడంతో ఉపఎన్నికలు జరిగాయి. శిల్పా మోహన్అప్పటివరకు తెలుగుదేశం పార్టీలో ఉన్న శిల్పా కుటుంబం భూమా నాగిరెడ్డి మృతి చెందడంతో వైసిపి పార్టీలో చేరిపోయారు.

ఉపఎన్నికల్లో శిల్పా మోహనరెడ్డి కి పోటీగా తెలుగుదేశం పార్టీ తరుపున భూమా బ్రహ్మానందరెడ్డి పోటీలో నిలబడడం రెండు పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం ఒక వైపు జగన్ మోహన్ రెడ్డి,మరో వైపు ముఖ్యమంత్రిగా ఉన్న నారా చంద్ర బాబు నాయుడు,రాష్ట్ర మంత్రులు,నాయకులు హోరాహోరీ ప్రచారాలు చేసినా విజయం భూమికే వరించింది.ఉపఎన్నికల్లో సైతం ముచ్చటగా మూడో సారి ఫరూక్ పెద్ద మనసుకు జోహార్లు అర్పించాల్సిందే.ఉపఎన్నికల్లో ఫరూక్ మెదడును పదును పెట్టి ప్రత్యర్థులు కోలుకోలేని రాజకీయం చేయడంతో టీడీపీ భారీ విజయం సాధించింది.శిల్పా మోహన్ రెడ్డి రెండుసార్లు ఓటమి చెందడంతో జీర్ణించుకోలేక రాజకీయాలకు దూరంగా ఉన్నారు.శిల్పా తనయుడు శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి రాజకీయాల్లోకి అడుగుపెట్టి 2019 ఎన్నికల్లో వైసిపి తరఫున పోటీ చేసి ఘన విజయం సాధించారు.ఆ ఎన్నికల్లో భూమా బ్రహ్మానందరెడ్డి ఓటమిపాలయ్యారు.1983 నుంచి తెలుగుదేశ పార్టీని నమ్ముకొని మూడు సార్లు అధిష్టానం ఆదేశాల మేరకు పదవులు త్యాగ చేసినా మొక్కవోని ధైర్యం తో పార్టీలో కొనసాగారు.వైసిపి అయిదేళ్ల పాలన ప్రజల కు నరకం చూపించడంతో తెలుగుదేశం పార్టీకి కలిసి వచ్చింది.2004 ఎన్నికల్లో నంద్యాల సీటు పై పలువురు నేతలు కన్నేశారు.భూమా తో పాటు పలువురు సీటుకోసం ప్రయత్నాలు సాగించారు.ఫరూక్ సైతం పోటీకి సై అనడంతో కొందరు వయసు పై బడింది అని అంటున్నా పార్టీపై నమ్మకంతో ఎన్ని ఆరోపణలు,విమర్శలు వచ్చిన చెరగని చిరునవ్వుతో పార్టీపై నమ్మకంతో వేచిచూసిన ఫరూక్ కు అధిష్టానం తీపి కబురు ఇచ్చింది.ఎట్టకేలకు ఫరూక్ ఎన్నికల్లో టికెట్ లభించడం అటువైపు డబ్బుకు వెనకాడని శిల్పా రవి ముందు డబ్బు ఖర్చు పెట్టలేని ఫరూక్ ఓటమి ఖాయమని విశ్లేషణ చేసిన అందరికీ ఆయన గెలుపే ఓ నిదర్శనంగా మారింది.వయసు ఎక్కువైనా మండుటెండలో యువకులు సైతం తిరగలేని పరిస్థితి,ఓ వైపు వాహన ప్రమాదం అన్ని లెక్కచేయకుండా యువకునిలాస్ పట్టణ,గ్రామీణ ప్రాంతాల్లో పర్యటనలు ఔరా అనిపించారు.నాయకులు అందరూ ఒక్కటయ్యారు ఫరూక్ విజయానికి బాటలు వేయడంతో 12 వేల మెజారిటీతో విజయం సొంతం చేసుకున్నారు.నాల్గవసారి గెలుపొందడం మరో సారి న్యాయ శాఖ,మైనార్టీ శాఖామాత్యులు గా నాలుగవ సారి మంత్రిగా అయ్యారు.ఎన్నికల్లో ఆయన తనయులు ఫిరోజ్,ఫయాజ్ లు తండ్రికి తగ్గ తనయులుగా పట్టణ,గ్రామీణ ప్రాంతాల్లో సుడిగాలి పర్యటనలు చేసి చిన్న,పెద్ద నాయకులను మామైకం చేసి తండ్రి విజయానికి అహర్నిశలు కష్టపడి తండ్రి విజయంలో కీలక పాత్ర పోషించారు.కూటమి అధికారంలో కి రావడం పార్టీ తరుపున చేపడుతున్న ఎన్నో కార్యక్రమాల్లో ప్రజలు సైతం ఆయనకు 75 ఏళ్లు,యువతకు మించి పర్యటనలు చేయడం అవసరమా అని చెప్పుకునే పరిస్థితి.రాష్ట్రంలో ఏ నాయకులు అయినా ఒక సబ్జెక్ట్ లో ప్రావీణ్యత ఉంటుంది.అన్ని సబ్జెక్ట్ లలో ఫరూక్ కు ప్రావీణ్యం ఉండడం అందరిని విస్మయపరుస్తుంది.

రాజకీయంగా,విద్యా,వైద్యం,అమరవీరుల త్యాగాలు,వారి చరిత్ర కళ్ళకు కట్టినట్టు చెప్పే విధానం ఆయనకు ఒక్కరికే సాధ్యం.రాజకీయంలో మచ్చలేని అదృష్టవంతులు ఎవరు అంటే ఫరూక్ ఒక్కరే అని చెప్పక తప్పదు.రాజకీయాల్లో ఒక్కసారి పదవి వస్తె ఆ నాయకుడు హంగు,ఆర్భాటం అంతా ఇంతా కాదు.ఒకసారి కాదు నాలుగుసార్లు మంత్రి పదవులు పొందినా నేటికి అందరిని చిరునవ్వుతో పలకరిస్తూ సాదారణ జీవితం గడపడం ఆయనకే చెల్లుబాటు అవుతుంది.పదవులు వస్తె కొందరు బుగ్గ కారు,హంగు,ఆర్భాటం లేకుండా బయటికి రాని పరిస్థితి అవన్నీ వద్దని మాత్ర అని గర్వం లేకుండా అందరి మాదిరి వాహనంలో వెళ్ళడం ఆయనకే దక్కుతుంది.పార్టీకి విదేయుడులా ఉండడంతో పదవులు వెతుకుంటూ వస్తాయి అనేందుకు ఒక ఉదాహరణ ఫరూక్ అని చెప్పవచ్చు.దేశ ప్రధాని నరేంద్ర మోదీ సైతం స్టేజీపై ఉన్న ఫరూక్ ను పిలిచి కరచాలనం చేయడం ఆ గౌరవం ఎన్ని జన్మలెత్తినా దొరకదు.రాజకీయాల్లో పార్టీ పై నమ్మకం ,ఇష్టంతో చేస్తే ఏదైనా సాధించవచ్చని నిరూపించారూ.నంద్యాల ప్రజలు ఆయనపై నమ్మకంతో గెలిపించినందుకు ప్రజల కోసం కోట్లు విలువ చేసే ఆస్తులు ఇచ్చిన ఘనత ఆయనకే సాధ్యం.రాజకీయాల్లో సెంటు భూమి ఇవ్వలేని నాయకులు సైతం ఉన్న ఈ కాలంలో కోట్లు విలువ చేసే స్థలాలు ఇచ్చినా ఆ కుటుంబం ను ప్రజలు మరిచిపోలేరు.







# జి.ఎస్.టి తగ్గింపుతో క్రీడా పరికరాల రేటు తగ్గించడం జరిగింది.

**జిఎస్టి తగ్గింపు ధరలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. -సెట్కూర్ సిఈఓ డాక్టర్ వేణు గోపాల్.**






**ఆంధ్ర ప్రగతి నంద్యాల, అక్టోబర్17:**
జి.ఎస్.టి తగ్గింపుతో క్రీడా పరికరాల రేటు 12 నుంచి 5,శాతం వరకు తగ్గించడం జరిగిందని సెట్కూరు సీఈవో డాక్టర్ వేణుగోపాల్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా యువజన సంక్షేమ శాఖ - సెట్కూరు మరియు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో 'సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్ ' పై అవగాహన కొరకు టాయ్స్ మరియు స్పోర్ట్స్ దుకాణాల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు.
ఈ సందర్భంగా సెట్కూర్ సి ఈ ఓ డాక్టర్. వేణు గోపాల్ మాట్లాడుతూ... నూతన జి యస్ టి స్లాబు ల సవరణ వల్ల క్రీడా పరికరాలపై జి.ఎస్.టి 12% నుండి 5% తగ్గినదని, క్రీడాకారులకు క్రీడా వస్తువులు ఇప్పుడు 5% రేటు కిందకు వస్తాయని, తగ్గిన పన్ను భారం వల్ల డబ్బు ఆదా అవుతుందని, ఇది క్రీడాకారులకు ప్రోత్సాహకరమని తెలిపారు. క్రీడలు యువతలో శారీరక దృఢత్వాన్ని మరియు మానసిక వికాసాన్ని పెంపొదిస్తాయనిస్తాయని పేర్కొన్నారు.
నంద్యాల మండల అభివృద్ధి అధికారి సుగుణ శ్రీ మాట్లాడుతూ స్థానిక బొమ్మల సమూహాలు మరియు క్రీడా వస్తువుల పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా ప్రభుత్వం "మేక్ ఇన్ ఇండియా" చొరవను బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. తగ్గిన %GST% రేట్ల వలన దేశీయ డిమాండ్‌ను పునరుద్ధరించాయి మరియు ఎగుమతి పోటీతత్వాన్ని పెంచాయి, బొమ్మలు మరియు క్రీడా వస్తువులకు ప్రపంచ కేంద్రంగా మారాలనేదే భారతదేశ లక్ష్యం అని తెలిపారు. జీఎస్టీ తగ్గింపు ధరలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు.
ఈ కార్యక్రమాలలో సెట్కూరు సూపరిటెండెంట్ శ్యామ్ బాబు, క్రీడా ప్రాధికార సంస్థ శిక్షకులు సుదర్శన్, కిశోర్ బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

# మెగా డీఎస్సీలో టీచర్ పోస్ట్ కొట్టిన పంచాయతీ సెక్రెటరీకి చిరు సన్మానం.



**ఆంధ్ర ప్రగతి మహానంది, అక్టోబర్ 17:**
ఇటీవల విడుదలైన మెగా డీఎస్సీలో ఉత్తీర్ణత సాధించి, టీచర్ పోస్ట్ సాధించిన పంచాయతీ సెక్రెటరీను సన్మానించిన పంచాయతీ నాయకులు. శుక్రవారం మహానంది మండలం ఆర్ఎస్ గాజులపల్లి పంచాయతీ కార్యదర్శి లక్ష్మీ ప్రసన్న మెగా డీఎస్సీలో ఉత్తీర్ణ ప్రసాదించి కర్నూలు జిల్లా, పత్తికొండ నియోజకవర్గం, తుగ్గలి మండలం, బొందిమడుగుల గ్రామంలోని పాఠశాలలో పోస్టింగ్ జాయినింగ్ మీద వెళుతున్న ఆమెను, గ్రామ నాయకులు, స్థానిక మరకత లింగేశ్వర స్వామి ఆలయంలో మస్తాన్ రావు చేతులమీదుగా శాలువా వేసి, జ్ఞాపకార్థం అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలుగు గంగ డిస్ట్రిబ్యూట్ కమిటీ చైర్మన్ చింతం క్రాంతి కుమార్ యాదవ్, గని చిన్న రంగస్వామి, ఆర్ఎస్ పాశం శ్రీనివాస్ యాదవ్, బోయ వీరేష్, జనసేన నాయకులు నల్లబోతుల మల్లికార్జున, బోనాసి ప్రసాద్, చిన్న కులాయి తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాల మెప్మా పీడీగా బాధ్యతలు చేపట్టిన వెంకట దాస్.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 17:** నంద్యాల పట్టణ ప్రాంతాలలో పేదరిక నిర్మూలన మరియు మహిళా సాధికారత లక్ష్యంగా పనిచేస్తున్న మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ గా వెంకట దాస్ గురువారం నంద్యాల పట్టణంలో బాధ్యతలు స్వీకరించారు.పట్టణంలోని మెప్మా కార్యాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం ఆయన లాంఛనంగా బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకట దాస్ మాట్లాడుతూ... సీఎం చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా పట్టణ ప్రాంత పేదలకు, ముఖ్యంగా స్వయం సహాయక బృందాల మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, లబ్ధి చేకూరే కార్యక్రమాలు చేపట్టి వాటి ఫలాలను క్షేత్రస్థాయి వరకు అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు."మెప్మా ద్వారా అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలు– స్వయం ఉపాధి, నైపుణ్యాభివృద్ధి శిక్షణ, ఆర్థిక తోడ్పాటు (బ్యాంకు లింకేజీ), వీధి వ్యాపారులకు సహాయం వంటి పథకాలను సమర్థవంతంగా అమలు చేయడమే తన ప్రథమ లక్ష్యం" అని ఆయన స్పష్టం చేశారు. పేదరికం లేని, స్వయం సమృద్ధి సాధించిన పట్టణ సమాజాన్ని నిర్మించడంలో నంద్యాల మెప్మా యూనిట్‌ను ఆదర్శంగా నిలపడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు.వెంకట దాస్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మెప్మా సిబ్బంది, పలు స్వయం సహాయక సంఘాల సభ్యులు, పట్టణ ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. మెప్మాలో ఆయన అందించిన సేవలను, సమర్థవంతమైన నాయకత్వ లక్షణాలను పలువురు ప్రశంసించారు. ఆయన సారథ్యంలో నంద్యాల పట్టణంలోని పేద ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# విద్యుత్ సంస్థ ప్రైవేటీకరణ విధానాలను ఉపసంహరించుకోవాలి.




ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 17:
కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ సంస్థలను ప్రభుత్వమే నడపాలని ప్రవేటికరణ చేయరాదని, 1-2-1999 వ సంవత్సరంలో చేరిన విద్యుత్ ఉద్యోగులందరికీ ఈపీఎఫ్ టు జిపిఎఫ్ పాత పెన్షన్ కల్పించాలని, ఇప్పటికే పెండింగ్లో ఉన్న నాలుగు డీఏలను ఇవ్వాలని, పి సి రేట్ వర్కర్లందరికి ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనాలు అమలు చేయాలని, విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులందరిని సంస్థలో విలీనం చేయాలని, సంస్థ ద్వారానే నేరుగా వేతనాలు చెల్లించాలని కోరుతూ విద్యుత్ కార్యాలయం ఎదుట కార్మికులు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ, సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మణ్,ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి తాళ్ల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీఎం వర్కర్స్ మౌలాలి, నరసింహ, సబ్ స్టేషన్ భాష, ఆపరేటర్స్ వెంకటాద్రి, కుమారస్వామి, అల్తాఫ్, శ్రీనివాసులు, కార్మికులు కేశాల్,వెంకటేష్ లు పాల్గొన్నారు. అనంతరం సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ఉద్యోగుల ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి తాళ్ల శ్రీనివాసులు లు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి రాష్ట్రంలోని టిడిపి ప్రభుత్వం అన్ని సంస్థలను ప్రైవేటీకరణ చేయడమే ధ్యేయంగా పెట్టుకున్నాయని పెట్టుబడుదారులకు కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తూ కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయని ప్రతి ఇంటిలో నిత్యవసర సరుకుగా మారిన విద్యుత్ ని, కార్మికులంతా రాత్రనకా పగలనకా కష్టపడి లాభాల బాటలో ఉంటే అటువంటి సంస్థను ప్రైవేటీకరణ చేయడం చాలా దుర్మార్గమని ప్రైవేట్ వ్యక్తులు లాభాల బాటలో ఉండాలనే ప్రభుత్వ నిర్ణయం సరైంది కాదని, ప్రభుత్వమే విద్యుత్ రంగా సంస్థలను నడపాలని, ఇప్పటికే పనిచేస్తున్న కార్మికులందరినీ విద్యుత్ సంస్థలో విలీనం చేసి సంస్థ ద్వారా నేరుగా కార్మికుల కు వేతనాలు చెల్లించాలని, పెండింగ్లో ఉన్న నాలుగు డిఏలను ఇవ్వాలని నేడు మూడు గంటలకు ప్రభుత్వం యాజమాన్యంతో కార్మికుల చర్చలను సఫలం చేసేలా కృషి చేయాలని,అలా కాకుండా విద్యుత్ ఉద్యోగుల, కార్మికుల జీవితాలతో ప్రభుత్వం ఆటలాడాలని చూస్తే సహించేది లేదని, కార్మికులంతా సమ్మె బాట చేపెడితే ప్రభుత్వానికి ప్రజల నుండి తీవ్రమైన వ్యతిరేకత వస్తుందని ప్రభుత్వాలే పూర్తి బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు.

# యువజన ఉత్సవాల్లో యువత ఉత్సాహంగా పాల్గొని ప్రతిభను చాటాలి.

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, అక్టోబర్ 17:**
యువజన ఉత్సవాల్లో యువత ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా యువజన సంక్షేమ శాఖ%-%సెట్కూరు ఆధ్వర్యంలో నిర్వహించబడనున్న నంద్యాల జిల్లా స్థాయి యువజన ఉత్సవాల పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ యువత తమ ప్రతిమను ప్రదర్శించడానికి యువజన ఉత్సవాలు అద్భుత వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు. 15 నుండి 29 సంవత్సరాల మధ్య వయస్సు గల యువతీయువకులు ఉత్సాహంగా పాల్గొని తమ సృజనాత్మకతను చాటుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖాధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ నెల 29న నంద్యాల శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయి యువజనోత్సవ పోటీలు ఏడు విభాగాల్లో నిర్వహించబడతాయని.... వీటిలో 1) జానపద నృత్యం (గ్రూప్), 2) జానపద గీతం (గ్రూప్), 3) కథా రచన, 4) కవితా రచన, 5) డిక్లేమేషన్ (ప్రసంగ పోటీ), 6) పెయింటింగ్, 7) ఇన్నోవేషన్ %-% సైన్స్ మేళా ఉన్నాయని సెట్కూరు సీఈఓ డా కె. వేణుగోపాల్ తెలిపారు. జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన విజేతలు రాష్ట్ర స్థాయికి, రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన వారు జాతీయ స్థాయికి ఎంపికవుతారని తెలిపారు. విజేతలకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు, మరియు పాల్గొన్న కళాకారులకు పార్టిసిపేషన్ సర్టిఫికేట్లు అందజేయబడతాయన్నారు. పోటీల్లో పాల్గొనదలచిన యువతీ యువకులు తమ పేరు లేదా బృందం పేరును వెబ్ లింక్ **https://bit.ly/ndldyf25** ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని, ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోలేని వారు అక్టోబర్ 29న ఉదయం 9.00 గంటలలోపు నేరుగా కళాశాలలో వచ్చి నమోదు చేసుకోవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు మొబైల్ నంబర్లు 92922 07601, 83281 81581లను సంప్రదించవచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి జనార్ధన్ రెడ్డి, ఇంటర్మీడియట్ విద్యాధికారి శంకర్ నాయక్, స్కిల్ డెవలప్మెంట్ అధికారి శ్రీకాంత్ రెడ్డి, రామకృష్ణ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బయ్య, సెట్కూరు పర్యవేక్షణ అధికారి శ్యామ్ బాబు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో చేరిన బేతంచెర్ల పట్టణ యువకులు.

**నంద్యాల పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు శ్రీ జెంగిటి లక్ష్మి నరసింహ యాదవ్ సమక్షంలో పార్టీ లో చేరిన యువకులు.**
**కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతలకు ఆకర్శితులై పార్టీ లో చేరిన యువకులు. -ఈ దేశానికి బీజేపీ సిద్ధాంతాలు ప్రమాదకరం.**
**నరేంద్ర మోడీ పర్యటన వల్ల రాయలసీమకు ఒరిగింది ఏమి లేదు. -ఈ బిజెపి పాలనలో దళితులకు, గిరిజనులకు, బహుజనులకు మైనార్టీలకు రక్షణ లేదు.**
**సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పై దాడి బీజేపీ కుట్ర. - దళిత ఐపీఎస్ అధికారి ఆత్మహత్యకు కారకులైన వారిని కాపాడుతున్నది ఎవరు.?**
**డోన్ నియోజకవర్గం సమన్వయ కర్త %ఢ% న్యాయవాది డాక్టర్ గార్లపాటి మద్దులేటీ స్వామి మరియు డిసిసి ఉపాధ్యక్షులు %ఢ% న్యాయవాది ఉన్నిగొర్ల జనార్దన్.**





**ఆంధ్రప్రగతి నంద్యాల జిల్లా అక్టోబర్ 17:**
నంద్యాల చెక్ పోస్ట్ లో ఉన్న దామోదరం సంజీవయ్య పార్టీ కార్యాలయములో కాంగ్రెస్డ్ పార్టీలో నంద్యాల పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు జెంగిటి లక్ష్మి నరసింహ యాదవ్ సమక్షంలో బేతంచెర్ల పట్టణానికి చెందిన షాషా వలి, ముస్తాక్, మొహిద్దీన్, రహీం లు చేరడం జరిగింది. ఈ సందర్భంగా డోన్ నియోజకవర్గం సమన్వయ కర్త %ఢ% న్యాయవాది డాక్టర్ గార్లపాటి మద్దులేటీ స్వామి,డిసిసి ఉపాధ్యక్షులు %ఢ% న్యాయవాది ఉన్నిగొర్ల జనార్దన్,లు మాట్లాడుతూ ,కాంగ్రెస్ పార్టీపై రోజు రోజుకు ఆదరణ,నమ్మకం పెరుగుతుందని, ఈ దేశానికి బీజేపీ సిద్ధాంతాలు ప్రమాదకరం అని, వీరి పాలనలో దళితులకు, గిరిజనులకు, బహుజనులకు మైనార్టీలకు రక్షణ లేదని,ఇటీవల కాలములో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పై దాడి బీజేపీ కుట్ర అని,దళిత ఐపీఎస్ అధికారి ఆత్మహత్యకు కారకులైన వారిని బీజేపీ కాపాడుతుందని వారు ఆరోపించారు.
నిన్నటి దినం కర్నూల్ పర్యటనకు వచ్చి దేశ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారు రాయలసీమకు మొండి చేయి చూయించారని , రాయలసీమ ముఖ ద్వారం అయినా కర్నూలుకు నిన్న నరేంద్ర మోడీ గారు వచ్చి పాడిందే పాట పాచి పండ్ల దాసరి అన్నట్లు పాత పథకాలే అనౌన్స్ మెంట్ చేసి వెళ్లారని వారు విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఈ దేశానికి స్వాతంత్ర్యం తెచ్చినా పార్టీ,ఈ దేశములో ఎందరో రాజకీయ నాయకులను తయారు చేసినా శిక్షణా పాఠశాల వంటిదని,ఈ దేశములో ఎన్నో కేంద్రియవిద్యా సంస్థలు నిర్మించి,నడిపించిన పార్టీ,ఎన్నో సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమలు,జాతీయ రహదారులు,నిర్మించిన పార్టీ,దేశములో పేదరిక నిర్ములన కోసం ఎంతగానో కృషి చేసిందని,ఈ పార్టీలో చేరడం అంటే దేశానికి సేవచేసే సౌభాగ్యం కలుగుతుంది.అని పార్టీ లో చేరిన యువకులు అన్నారు. బీజేపీ చేసే తప్పుడు ఆలోచనల వలన వేల మంది యువకులు, మేధావులు,కవులు,కళాకారులు, చేరటానికి ఎంతో ఉత్సాహంగా కనపడుతున్నారు.ఈ కార్యక్రమం లో డోన్ నియోజకవర్గం సమన్వయ కర్త డాక్టర్ గార్లపాటి మద్దులేటీ స్వామి,డిసిసి ఉపాధ్యక్షులు ఉన్నిగొర్ల జనార్దన్,హెచ్. బాలస్వామి,డిసిసి అధికార ప్రతినిధి %ఢ% సోషల్ మీడియా చైర్మన్ సంజీవ్ కుమార్, బేతంచెర్ల మండల అధ్యక్షులు ధోని రామాంజనేయులు,మైనారిటి రాష్ట్ర నాయకులు రజాక్, బిసి సెల్ రాష్ట్ర నాయకులు బోయ రమణ, తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ గారు మంజూరు చేసిన శ్మశాన వాటిక స్థలానికి అంతటికి సిమెంట్ స్తంభాలతో కంచె వేయాలి.

### ఒక సమాధి వైపు మాత్రమే కంచె వేయడం పట్ల విమర్శలు.



**ఆంధ్ర ప్రగతి శిరివెళ్ల అక్టోబర్ 17:** మండల పరిధిలోని బోయలకుంట్ల గ్రామంలో ఒక స్మశాన వాటికకు సంబంధించి గత నాలుగు రోజులుగా పలు ఆరోపణలు విమర్శలు చర్చలకు దారితీస్తున్నాయి. గ్రామపంచాయతీ కార్యదర్శి గాని గ్రామ రెవెన్యూ అధికారి గాని ఆ పై స్థాయి అధికారి గాని ఎటువంటి అనుమతి లేకుండా స్మశాన వాటిక పేరుతో సిమెంట్ స్తంభాలు పాతి కంచెను ఏర్పాటు చేయడం పట్ల శిరివెళ్ల మండలం బోయలకుంట్ల గ్రామంలో పలు విమర్శలు అనుమానాలకు తావిస్తున్నదని పలువురు ఆరోపిస్తున్నారు.గతంలో జిల్లా కలెక్టర్ అనుమతి ఇచ్చినటువంటి స్మశాన వాటిక స్థలానికి అంతటికి మండల సర్వేయర్ లేదా గ్రామ వార్డు విలేజ్ సర్వేయర్, గ్రామ కార్యదర్శి ద్వారా నలుదిక్కుల హద్దులు ఏర్పాటు చేసి చుట్టుకొలత చూపించి కలెక్టర్ గారు మంజూరు చేసిన విస్తీర్ణానికి అంతటికి కంచె ఏర్పాటు చేయాలని ఒక సామాజిక వర్గ ప్రజలతో పాటు గ్రామస్తులు సూచించారు. అయితే ఒక సమాధి వైపు మాత్రమే ఎటువంటి అనుమతులు లేకుండా స్మశాన వాటిక పేరుతో సిమెంట్ స్తంభాలు పాతి కంచెను ఏర్పాటు చేసుకోవడం సరైన పద్ధతి కాదని బోయలకుంట్ల గ్రామస్తులు విమర్శిస్తున్నారు. గ్రామ కంఠానికి సంబంధించిన స్థలంలో కంచే ఏర్పాటుకు ఎవరు అనుమతులు మంజూరు చేయలేదని ఏ అధికారి గానీ స్మశాన వాటిక యొక్క హద్దులు చూపి విస్తీర్ణాన్ని నిర్ధారించ లేదని గ్రామస్తులు తెలియజేశారు.

జిల్లా కలెక్టర్ మంజూరు చేసిన స్థలానికి అంతటికి కంచె ఏర్పాటు చేసి ఉంటే ఎటువంటి అనుమానాలకు తావు ఉండదని కేవలం ఒక సమాధి వైపు మాత్రమే కంచె ఏర్పాటు చేసుకోవడం పట్ల అది స్వలాభా పేక్షన లేక అధికారుల నిర్లక్ష్య వైఖరి నా అన్నది తేలాల్సి ఉందని పలువురు సందేహం వ్యక్తం చేస్తున్నారు.

బోయలకుంట్ల గ్రామపంచాయతీ కార్యదర్శి మరియు బోయలకుంట్ల గ్రామ రెవెన్యూ అధికారి స్మశాన వాటిక యొక్క విస్తీర్ణాన్ని చూపించి ఎవరైనా దాతలు ముందుకు వస్తే కంచె ఏర్పాటుకు పూల మొక్కలతో నందనవనం చేసేలా కృషి చేయాలని లేని పక్షంలో స్వలాభాపేక్షగా కొద్ది విస్తీర్ణంలో కంచె ఏర్పాటు చేసి ఉంటే తక్షణమే తొలగించాలని శిరివెళ్ల మండలం బోయలకుంట్ల గ్రామ ప్రజలు పేర్కొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత.

### సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి.



పి. మహమ్మద్ రఫి,సామాజిక కార్యకర్త, డోన్.

**ఆంధ్ర ప్రగతి డోన్ అక్టోబర్ 17:** ప్రస్తుత ఆధునిక యుగం లో పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా నడుచుకోవలసిన ఆవశ్యకత ఎంతైన ఉన్నది. లేని పక్షం లో వైపరిత్యాలు ఎక్కువగా జరిగే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీనిపై ప్రజల్లో అవగాహన అవసరమని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి తెలిపారు. ప్రకృతి సమతుల్యతలను చెడగొట్టడం వల్ల ప్రకృతి వైపరిత్యాలు జరుగుతున్నాయని పరిశోధనల్లో శాస్త్రవేత్తలు తెలియజేస్తున్నారు. కావున పర్యావరణాన్ని కాపాడవలసిన ఆవస్యకత ఖచ్చితంగా ఉన్నది .ఇప్పటికే కాలుష్యం వల్ల చిన్నపిల్లల మరణాలు సంభవిస్తున్నాయి. వాయుకాలుష్యం వల్ల చాలా మంది అనారోగ్యానికి గురి అగుచున్నారు.మనిషి ఆయుష్యుని తగ్గిస్తున్న కాలుష్యం ,పర్యావరణం పరిరక్షణ పై ప్రజల్లో విసృతమైన చర్చ జరగాలి. పర్యావరణ పరిరక్షణ ,కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేసి మన ఆరోగ్యాలను మనమే కాపాడుకోవాలని, ప్రకృతి వైపరిత్యాలను జరగకుండా పర్యావరణాన్ని కాపాడుకోవలసిన ఆవస్యకత ఎంతైన ఉన్నదని , రాబోయే తరాలకు కూడ కొంత మేలు చెయ్యవలసిన భాద్యత మనపై ఉన్నదని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి తెలిపారు.ప్రకృతి అనునది భూమి పై ఉన్న ఒక గొప్ప వనరు. ప్రకృతి అను అంశం లో గాలి,నీరు ,చెట్లు జంతువులు ,నిర్జీవ అంశాలు మిళితమై ఉన్నాయి. ఈ అంశాలన్ని ఒక దాని పై ఒకటి ఆధారపడి ఉన్నాయి. కొన్ని సందర్భాలలో ప్రకృతి లో జరిగే పెను మార్పు వల్ల తుఫానులు, వరదలు, భూకంపాలు సంభవించి ప్రాణ ఆస్థి నష్టాలకు దారి తీస్తున్నాయి. సముద్రాలలో భూకంపాలు సంభవించి సునామి లాంటి పెను విపత్తులు వస్తున్నాయి. సునామి ద్వార తీర ప్రాంత ప్రజలు చాలా నష్టపోతారు. ప్రపంచమంతటా ఏన్నో రకాలైన పర్యావరణ విపత్తులు సంభవిస్తున్నాయి. ముఖ్యంగా మానవుడు పర్యావరణానికి చేయు నష్టాలు కూడ విపత్తులకు ఒక కారణం. మోటరు వాహనాలు ,పరిశ్రమలు, ప్లాస్టిక్ వినియోగం మొదలైన వాటి వల్ల గాలి, నీరు, భూమి కలుషితం అవుతున్నాయి. దీని వల్ల భూమి వాతావరణ ఉష్ణోగ్రత క్రమంగా పెరుగుతూ పెను విపత్తులకు దారి తీస్తుందని శాస్త్రవేత్తలు తెలియజేస్తున్నారని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాలలో ప్రకృతి విపత్తులు సంభవించడాన్ని ముందుగానే పసిగట్టి ప్రజలను జాగ్రత్త పరుస్తూ ఆస్తి, ప్రాణ నష్టాలను తగ్గించడం జరుగుతుంది .ప్రకృతి వైపరిత్యాలను అధిగమించాలంటే మనమంతా ప్రకృతి నియమాలకు కట్టుబడి ఉండాలి.పర్యావరణ పరిరక్షణకు మేధావులు, శాస్త్రవేత్తలు,జర్నలిస్టులు, ప్రభుత్వాలు,అన్ని రాజకీయపార్టీలు,ప్రజాసంఘాలు, స్వచ్చంద సంస్థలు, అధికారులు అందరు కలిసి అవగాహణ కలిగించాలి. పర్యావరణాన్ని కాపాడుకొని మన ఆరోగ్యాలను కాపాడుకోవాలని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి తెలిపారు.

# జిల్లా కలెక్టర్ రాజకుమారిని అభినందించిన సి ఎం చంద్రబాబు.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, అక్టోబర్ 17:** భారత గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం శ్రీశైలం పుణ్యక్షేత్ర పర్యటన విజయవంతంగా పూర్తయిన నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారిని ప్రత్యేకంగా అభినందించారు. శుక్రవారం అమరావతి సచివాలయం నుండి నంద్యాల, కర్నూలు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ప్రధానమంత్రి పర్యటనకు సంబంధిత అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు.


కలెక్టర్ చాంబర్ నుండి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటనను ఎస్ఓపీ మార్గదర్శకాలకు అనుగుణంగా సాఫల్యవంతంగా నిర్వహించామని తెలిపారు. సున్నిపెంట హెలిప్యాడ్ నుండి భ్రమరాంబ గెస్ట్ హౌస్ వరకు 10.2 కిలోమీటర్ల అటవీ ప్రాంతంలో ప్లాస్టిక్ మరియు వ్యర్థ పదార్థాలు లేకుండా శుభ్రంగా ఉంచడమే లక్ష్యంగా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని చెప్పారు. హెలిప్యాడ్ నుంచి భ్రమరాంబ గెస్ట్ హౌస్ వరకు ఉన్న 8 స్పీడ్ బ్రేకర్లను తొలగించి వాహనాలు సాఫీగా ప్రయాణించేలా చర్యలు చేపట్టామని వివరించారు. అలాగే హెలిప్యాడ్ పరిసరాలు, శివాజీ స్ఫూర్తి కేంద్రం, నందిగుడి సర్కిల్ ప్రాంతాల్లో అటవీ శాఖ రెస్క్యూ బృందాలు క్షేత్ర స్థాయిలో సమన్వయంతో పనిచేశాయని తెలిపారు. పర్యటన సమయంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దర్శన ఏర్పాట్లు సమర్థవంతంగా నిర్వహించామని, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా క్రమబద్ధంగా నియంత్రణ చేపట్టామని కలెక్టర్ తెలిపారు. ప్రధానమంత్రి పర్యటన సమయానికి ముందు మరియు అనంతరం కూడా భక్తులను క్యూలైన్లలో సక్రమంగా అకామడేట్ చేసి దర్శనం కల్పించడం వల్ల ఎటువంటి సమస్యలు తలెత్తలేదని పేర్కొన్నారు.ప్రాచీనమైన శ్రీశైల క్షేత్రం మహిమకు భంగం కలగకుండా, ఆలయం ఆధ్యాత్మిక వాతావరణం నిలుపుకునేలా తక్కువ మోతాదులో పుష్పాలతో అలంకరణ చేసినట్లు తెలిపారు. అప్పటి కాలంలో శ్రీశైలం క్షేత్రం ఉన్న రూపాన్ని ప్రతిబింబించేలా, అవసరమైన ప్రదేశాల్లో మాత్రమే కార్పెట్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఆలయ పుష్పాలంకరణ కోసం బెంగళూరు నుండి పూలను తెప్పించే ముందు అక్కడే నాణ్యత తనిఖీ చేయించి, పుణ్యక్షేత్రం శోభను మరింత పెంచేలా సుందరంగా అలంకరించామని వివరించారు. ప్రధానమంత్రి శ్రీశైలం పర్యటనకు సంబంధించిన అన్ని కార్యకలాపాలను డాక్యుమెంటేషన్ రూపంలో సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పిస్తామని కలెక్టర్ ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. ద్వితీయ జ్యోతిర్లింగం మరియు శక్తిపీఠం అయిన శ్రీశైల పుణ్యక్షేత్రాన్ని సందర్శించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్యాత్మిక ఉల్లాసంతో నిండిపోయారని పేర్కొన్నారు. శ్రీశైల క్షేత్రంలోని ఆధ్యాత్మిక శక్తిని ప్రధానమంత్రి స్వయంగా అనుభవించారని ముఖ్యమంత్రి వివరించారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి నాయకత్వంలో ప్రధానమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించినందుకు ముఖ్యమంత్రి అభినందనలు తెలియజేశారు. భద్రత, ప్రజా నిర్వహణ, వసతి, ట్రాఫిక్, కమ్యూనికేషన్, మీడియా సమన్వయం వంటి అన్ని విభాగాల్లో జిల్లా యంత్రాంగం సమర్థవంతంగా పనిచేసిందని ఆయన ప్రశంసించారు.

# శబరి.. శబరి అంటూ ప్రత్యేకంగా పలకరించిన ప్రధాని మోదీ.

### శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లను భక్తి శ్రద్ధలతో దర్శనం చేసుకున్న నీకు సంతోషమేనా శబరి

### - భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ.

### రాష్ట్రంలో గుడ్ వర్కర్ ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్న ముఖ్యమంత్రి చంద్రబాబు.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా అక్టోబర్ 17:** కర్నూలులో సూపర్ జీ ఎస్టీ, సూపర్ సేవింగ్స్ భారీ బహిరంగ సభ, శ్రీశైల భ్రమరాంబ, మల్లికార్జున స్వామి వార్ల దర్శనం కోసం గురువారం వచ్చిన భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నంద్యాల జిల్లా ఓర్వకల్లు విమానాశ్రయంలో ఉదయం స్వాగతం సమయంలో, సాయంత్రం వీడ్కోలు సమయంలో శబరి... శబరి అంటూ ప్రత్యేకంగా పలకరింపుతో నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి ప్రత్యేక ఆకర్షణగా విమానాశ్రయంలో నిలిచారు. కర్నూలు పర్యటనలో ఓర్వకల్లు విమానాశ్రయంలో ప్రధానమంత్రి కీ స్వాగతం పలికే సమయంలో రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్, తదితర రాష్ట్ర మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే లను, ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు పరిచయం చేసే సమయంలో శబరి ఎక్కడ అంటుండగా ప్రధాని అనగానే ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మోదీజీ మీరూ ఎలా ఉన్నారు. అంటుండగా సీఎం చంద్రబాబు ఆమె మన నంద్యాల ఎంపీ అనగానే ప్రధాని మోడీ వెంటనే స్పందించి అవును నాకు తెలుసు, ఆమె నన్ను పార్లమెంట్ లో పలుమార్లు శ్రీశైలం రమ్మని పిలిచారు. శబరి వల్లే నేను శ్రీశైలం వచ్చాను, శబరి మీకు నా ఆశీస్సులు అని భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరిని దీవించారు.శ్రీశైల భ్రమరాంబ, మల్లికార్జున స్వామి దర్శనం, శివాజీ స్ఫూర్తి కేంద్రంలో ప్రశాంతంగా ధ్యానం చేసుకొని, కర్నూలు వద్ద సూపర్ జీ ఎస్టీ-సూపర్ సేవింగ్స్ భారీ బహిరంగ సభ విజయవంతం అనంతరం ఢిల్లీకి తిరుగు ప్రయాణంలో ఓర్వకల్లు విమానాశ్రయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర మంత్రులు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి వీడ్కోలు పలికే సమయంలో మళ్ళీ ప్రధాని మోడీ శబరి ఎక్కడ అంటూ మంత్రుల తర్వాత నిలిచిన బైరెడ్డి శబరి వద్దకే చేతులు ఊపుతూ ప్రధాని వెళ్లి శ్రీశైల భ్రమరాంబ, మల్లికార్జున స్వామి వార్లను భక్తి శ్రద్దలతో దర్శనం చేసుకున్నా, శివాజీ మహారాజ్ స్ఫూర్తి కేంద్రంలో ప్రశాంతంగా ధ్యానం చేసుకున్నా నీకు సంతోషమేనా అంటుండగానే సీఎం చంద్రబాబు రాష్ట్రంలో ఎంపీ బైరెడ్డి శబరి గుడ్ వర్కర్ అనగానే ప్రధానమంత్రి మోడీ నాకు తెలుసు, డైనమిక లీడర్ శబరి అంటూ భారత ప్రధానమంత్రి కితాబ్ ఇచ్చారు.

# కౌతాళం కేజీబీవీ హాస్టల్ లో వసతులు కరువు.

### అపరిశుభ్రంగా ఉన్న వాష్ రూమ్,టాయిలెట్స్.

### త్రాగడానికి మినరల్ వాటర్ ఏర్పాటు చేయాలి.

### సక్రమంగా మెనూ పాటించాలి. -ఏఐఎస్ఎఫ్ డిమాండ్.










**ఆంధ్ర ప్రగతి కౌతాళం అక్టోబర్ 17:** కౌతాళం మండల కేంద్రంలో స్థానికంగా ఉన్నటువంటి కస్తూర్బా గాంధీ బాలికల హాస్టల్ ను ఏఐఎస్ఎఫ్ నాయకురాలు సందర్శించారు.అనంతరం విద్యార్థులకు భోజనం వడ్డించి కలిసి భోజనం చేశారు ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ మహిళా కన్వీనర్స్,లత, మానస, నాగరత్న,సంగీత,వైశాలి,హర్ష మాట్లాడుతూ కౌతాళం మండలంలో ఉన్న కేజీబీవీ హాస్టల్, అనేక సమస్యలు ఉన్నాయని విద్యార్థులు మా దృష్టికి తీసుకోరావడంతో శుక్రవారం మధ్యానం హాస్టల్ సందర్శించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకోవడం జరిగింది. విద్యార్థులు అవసరమైన వాష్ రూమ్,టాయిలెట్స్ లో,నీళ్లు లేక నిరుపయోగంగా ఉన్నాయని, ఎప్పుడు స్థానానికి మూత్రవిసర్జనకు నానా అవస్థలు పడుతున్నారని,అదేవిధంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తగినంత అన్నం వడ్డించడం లేదనీ అన్నం తక్కువ వస్తుందని తెలిపారు. అన్నం తిన్న తర్వాత మిలిటర్ నీళ్లు కాకుండా పరిశుభ్రంగా ఉన్న బోర్ నీళ్ళు తాగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అనంతరం మండల అధ్యక్ష కార్యదర్శి హనుమేష్,సాయివర్మ జిల్లా కార్యవర్గ సభ్యుడు గురు బసవరాజ్,మాట్లాడుతూ.. కేజీబీవీ హాస్టల్ వార్డెన్ పై చర్యలు తీసుకోవాలి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంలో పూర్తిగా విఫలం చెందారని,విద్యార్థులు అర్థాకాలితో అలమటిస్తున్న పట్టించుకోవడంలేదని అన్నారు.అధికారుల స్పందించి విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని,డిమాండ్ చేశారు లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలకు పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, నాయకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయాల్లో యువతకు భాగస్వామ్యం

### సేనతో సేనాని పేరిట వినూత్న కార్యక్రమం -డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ వెల్లడి



అమరావతి, **అక్టోబర్ 17,ఆంధ్ర ప్రగతి:**రాజకీయ వ్యవస్థలో నవతరం యువతను భాగస్వామ్యం చేస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. సమాజంలో మార్పు కాంక్షించే ప్రతీ ఒక్కరికీ వారి వంతు సేవలు మాతృభూమికి అందించే అవకాశం కల్పించేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా 'సేనతో సేనాని - మన నేల కోసం కలిసి నడుద్దాం' అంటూ ఒక వినూత్నమైన కార్యక్రమాన్ని జనసేన నిర్వహించనుందని చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా ఔత్సాహిక యువతీ, యువకులు తమకు నచ్చిన అంశాన్ని ఎంచుకుని సేవలు అందించే అవకాశాన్ని ఈ వేదిక కల్పించనుందని తెలిపారు. మార్పు కోరుకుంటే రాదని.. మార్పు కోసం ప్రయత్నిస్తే వస్తుందని ఉద్ఘాటించారు. ఈ ప్రయత్నంలో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాలుపంచుకునేందుకు ఖీఖీ కోడ్ స్కాన్ చేసి, లేదా లింక్ మీద క్లిక్ చేసి ఇప్పుడే రిజిస్టర్ చేసుకోవాలని పవన్ కల్యాణ్ సూచించారు.

## స్వర్గీయ డి. రాజవర్ధన్ రెడ్డి స్మారక 3వ అంతర్జాతీయ ఓపెన్ రాపిడ్ మరియు బ్లిట్జ్ ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్ - 2025

**కర్నూలులో అంతర్జాతీయ చెస్ పోటీలను ప్రారంభించిన.. రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్.**




**ఆంధ్ర ప్రగతి కర్నూలు అక్టోబర్ 17:**
చదరంగ క్రీడను ప్రోత్సహించడంలో, క్రీడాకారులను తీర్చిదిద్దడంలో తమవంతు కృషి చేసిన స్వర్గీయ డి. రాజవర్ధన్ రెడ్డి జ్ఞాపకార్థం నిర్వహించిన 3వ అంతర్జాతీయ ఓపెన్ రాపిడ్ మరియు బ్లిట్జ్ ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్ – 2025 ను ఈ రోజు (అక్టోబర్ 17, 2025) కర్నూల్ నగరంలోని ప్రతిష్టాత్మక కె. వి. సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో అత్యంత వైభవంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్ల శ్రీనివాస్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ స్వర్గీయ డి. రాజవర్ధన్ రెడ్డి క్రీడలకు చేసిన సేవలను మరచిపోలేనివని, అంతర్జాతీయ స్థాయి టోర్నమెంట్లు నిర్వహించడం ద్వారా యువ క్రీడాకారులకు స్ఫూర్తి లభించిందన్నారు. ఇలాంటి వేదికలు క్రీడాభివృద్ధికి దోహదపడతాయని తెలిపారు. చదరంగం మెదడుకు పదును పెట్టే క్రీడ అని, యువత ఇలాంటి ఆరోగ్యకరమైన క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. ఈ టోర్నమెంట్ రాపిడ్ మరియు బ్లిట్జ్ ఫార్మాట్లలో అంతర్జాతీయ



చెస్ సమాఖ్య నిబంధనలకు అనుగుణంగా నిర్వహించబడుతోందని . అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన విజేతలకు భారీ బహుమతులు, ట్రోఫీలు అందజేయబడతాయని ఈ టోర్నమెంట్ విజయవంతం కావడానికి నిర్వాహక కమిటీ సభ్యులు, కె. వి. సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలల అధినేత కేవీ సుబ్బారెడ్డి గారిని అభినందించారు అలాగే స్వర్గీయ డి. రాజవర్ధన్ రెడ్డి గారి కుటుంబ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో కర్నూల్ ఎంపీ నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి, నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, కెడిసిసి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, నాగేశ్వర యాదవ్, మాజీ ఎమ్మెల్యే గఫూర్, కార్తీక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాల జిల్లాకు జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ చేసిన సేవలు మరువలేనివి.

**పరిశ్రమలకు భూ కేటాయింపులో విశేష కృషి చేసిన జెసి. :జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**

**విధి నిర్వహణలో జిల్లా కలెక్టర్, అధికారుల సహకారం మరువలేనివది. :జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల, అక్టోబర్ 17:**
జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ సేవలు మరువలేనివని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా తెలిపారు.
శుక్రవారం కలెక్టరేట్లోని పిజిఆర్ ఎస్ హాల్ నందు సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ సెక్రటరీగా బదిలీపై వెళుతున్న జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ... జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ జిల్లాలో రీ సర్వేను ఎంతో సమర్థవంతంగా నిర్వహించారన్నారు.
ఏ పని చెబితే ఆ పని అయిపోయేంతవరకు కార్యాలయం నుంచి వెళ్లేవారు కాదని, రాత్రింబవళ్లు కష్టపడి పనిచేసే మనస్తత్వం కలిగిన వ్యక్తిని కొనియాడారు. రే సర్వే, రెగ్యులర్ రెవెన్యూ సమస్యలు దాదాపు 25 వేల దరఖాస్తులను సమర్థవంతంగా పరిష్కరించడం జరిగింది. రెవెన్యూ సమస్యలు ఈ జిల్లాలో ఎక్కువగా ఉన్నాయని వాటి పరిష్కారానికి జాయింట్ కలెక్టర్ చాలా కూల్ గా డీటెయిల్ గా వెళ్లి ఒక్కొక్క పనిని సిస్టమేటిగ్గా పరిష్కరించడం జరిగిందన్నారు. పరిశ్రమలకు భూ కేటాయింపులో జెసి చేసిన కృషి మరువలేనిదన్నారు. జిల్లాలో జరిగిన యోగాంధ్ర, పీఎం శ్రీశైలం పర్యటన మరియు జిల్లాలో జరిగిన సంఘటనలు జిల్లా యంత్రాంగం సహకారంతో ఎంతో విజయవంతంగా పూర్తి చేశారన్నారు. జెసి గారు ఏడు సంవత్సరాలు సైంటిస్ట్ గా పనిచేసి సివిల్స్ రాసి ఐఏఎస్ సాధించడం ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. ప్రతి ఒక్కరూ ఆయనను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలన్నారు. నంద్యాల జిల్లాకు ఒక మంచి జేసీగా ప్రతి ఒక్కరి మన్ననలు పొందిన జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ బదిలీపై వెళ్లడం ఎంతో బాధాకరంగా ఉందన్నారు. సివిల్ సప్లై కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గా బదిలీపై వెళుతున్న జెసి గారు అక్కడ కూడా మంచి పేరు తెచ్చుకొని మరిన్ని ఉన్నత పదవులకు వెళ్లాలని కలెక్టర్ ఆకాంక్షించారు.
అనంతరం బదిలీపై వెళుతున్న జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ మాట్లాడుతూ... జిల్లాలో ఒక జాయింట్ కలెక్టర్ గా పని చేయాలంటే మొదటగా కలెక్టర్ సపోర్టు, అధికారుల సపోర్టు ఉండాలన్నారు. ఇక్కడ కలెక్టర్ సపోర్ట్ వల్ల ఉండడంవల్ల బాగా పనిచేయగలిగానని తెలిపారు. నంద్యాల జిల్లాలో ఒక సంవత్సరం 3,నెలలో అన్ని శాఖల అధికారులు ఇచ్చిన సహకారం మరువలేని దన్నారు. ప్రతి అధికారి ఒత్తిడిలకు గురికాకుండా నిధులు నిర్వహించినట్లయితే ఎలాంటి పని అయినా సమర్థవంతంగా చేయగలరన్నారు. అన్నమయ్య జిల్లాలో జాయింట్ కలెక్టర్ గా పనిచేసి ఎన్నో జ్ఞాపకాలు తీసుకెళు తున్నానని అధికారులందరూ నాపై చూపిన ప్రేమ అభిమానానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు.
డిఆర్ఓ రామునాయక్ మాట్లాడుతూ.... జాయింట్ కలెక్టర్ భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించడం జరిగిందన్నారు. దాదాపు 15,నెలల కాలంపాటు పనిచేసిన జాయింట్ కలెక్టర్ మిత భాసి, మృదుస్వభావి, శాంతి స్వభావి ప్రతి ఒక్కరితో ఎంతో సన్నిహితంగా ఉండేవారన్నారు. జిల్లా అభివృద్ధికి తమదైన శైలిలో విధులు నిర్వహించి ప్రతి ఒక్కరి మన్ననలు పొందారన్నారు. ఇలాంటి మంచి అధికారి ఇంకా కొద్ది కాలం పాటు మన జిల్లాలో పనిచేసుంటే ఎంతో బాగుండేదని డిఆర్ఓ, పలువురు అధికారులు ఆకాంక్షించారు.
అనంతరం జిల్లాలోని ఆర్డీవోలు, తహసిల్దార్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు జాయింట్ కలెక్టర్ తో ఉన్న అనుభవాలు జ్ఞాపకాలను పంచుకున్నారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఆర్డీవోలు, తాహసిల్దారులు, వివిధ శాఖల అధికారులు జాయింట్ కలెక్టర్ కి జ్ఞాపికను అందజేసి శాలువలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

## ప్రభుత్వ హాస్పటల్‌లో క్రిటికల్ కేర్ యూనిట్ కు శంకుస్థాపన చేసిన మంత్రి ఎన్ఎండి ఫరూక్.








**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 17:**
నంద్యాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ప్రభుత్వ సంకల్పంలో భాగంగా, నంద్యాల పట్టణంలోని స్థానిక ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ ఆవరణంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న క్రిటికల్ కేర్ యూనిట్ కు రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ఘనంగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ జిల్లా ప్రజలకు అత్యవసర, క్లిష్ట పరిస్థితుల్లో మెరుగైన వైద్యం అందించేందుకు ఉద్దేశించిన ఈ క్రిటికల్ కేర్ యూనిట్ ను ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, అందులో భాగంగానే మారుతున్న కాలానికి అనుగుణంగా అత్యాధునిక వైద్య సౌకర్యాలను జిల్లా కేంద్రమైన నంద్యాలలో అందుబాటులోకి తీసుకురావడం జరుగుతోందని తెలిపారు. ఈ నూతన క్రిటికల్ కేర్ యూనిట్ అందుబాటులోకి వస్తే, అత్యవసర చికిత్స అవసరమయ్యే రోగులకు మెరుగైన వసతులు, ప్రత్యేక చికిత్సలు ఇక్కడే అందించడానికి అవకాశం ఉంటుందని, తద్వారా స్థానిక ప్రజలు మెరుగైన వైద్య సేవలు కోసం ఇతర నగరాలకు వెళ్లవలసిన అవసరం తప్పుతుందని వివరించారు. ఈ క్రిటికల్ కేర్ యూనిట్ ను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.
ఈ కార్యక్రమంలో నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, డాక్టర్ సోహెల్, కౌన్సిలర్లు శ్రీదేవి, జైనాబి, ఖండే శ్యామ్ సుందర్ లాల్, మాజీ కౌన్సిలర్ శివశంకర్ యాదవ్, కామిని మల్లికార్జున, ప్రముఖ పారిశ్రామికవేత్త పబ్బతి వేణు, బ్యాంకు తిమ్మయ్య, జెపి , వేద సాయినాథ్, మున్నా, నాగేశ్వరరావు, విజయ గౌరీ, పద్మ, జోష్ణ, భారతి, నాగరత్నమ్మ , గుద్దేటి వెంకటేశ్వర్లు, సాయిరాం, ఎబినేజర్, కోమలి మధు, శ్రీకాంత్ నాయుడు , జోసెఫ్ , దూదేకుల దస్తగిరి , తోటరామయ్య, కాజా శంకర్ తదితరులు మరియు స్థానిక ప్రజా ప్రతినిధులు, వైద్య కళాశాల ప్రిన్సిపాల్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు, సిబ్బంది మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## 19న విడుదల కానున్న టిటిడి జనవరి కోటా

**ఆర్జిత సేవలకు ఆన్‌లైన్ లో విడుదల**



తిరుమల,**అక్టోబర్ 17,ఆంధ్ర ప్రగతి::** వచ్చే ఏడాది జనవరి నెలకు సంబంధించిన శ్రీవారి ఆర్జిత సేవల కోటా టికెట్లు, అంగ ప్రదక్షిణ టోకెన్లను ఈ నెల 19వ తేదీ ఉదయం 10 గంటలకు టిటిడి ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం అక్టోబర్ 21వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ టికెట్లు పొందినవారు అక్టోబర్ 21 నుంచి 23వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకరణ సేవా టికెట్లను ఈనెల 23న ఉదయం పది 10 గంటలకు తితిదే ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్లు టిటిడి ప్రకటించింది. వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటా కూడా 23 మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్ అందుబాటులో ఉండనుంది. శ్రీవాని ట్రస్టు దర్శన టికెట్ల కోటాను 24న ఉదయం 11 గంటలకు, వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా ఉచిత ప్రత్యేక ప్రవేశ దర్శనం టోకెన్ల కోటాను 24న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నారు. ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను 25న ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నారు. తిరుమల, తిరుపతిలలో గదుల కోటాను 25న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. శ్రీవారి ఆర్జిత, దర్శన టికెట్లను వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకోవచ్చని తితిదే ఓ ప్రకటనలో తెలిపింది.

# నంద్యాలలో ఘనంగా ప్రపంచ అనస్థీషియా దినోత్సవం.

**నంద్యాల అనస్థీషియా వైద్యుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహణ. : వైద్య రంగ పురోగతిలో అనస్థీషియా వైద్యులదే కీలక పాత్ర: డాక్టర్ రవి కృష్ణ,**

**సీనియర్ అనస్థీషియా వైద్యులు డాక్టర్ రవి కృష్ణ,డాక్టర్ శేష ఫణి, డాక్టర్ మధుసూదన రెడ్డి, డాక్టర్ మాధవి లను సత్కరించిన నంద్యాల ఐఎంఏ వైద్యులు.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 17:**
ప్రపంచ అనస్థీషియా దినోత్సవాన్ని గురువారం రాత్రి ఇండియన్ అనస్థీషియా సొసైటీ నంద్యాల శాఖ ఆధ్వర్యంలో, ఐఎంఏ నంద్యాల సహకారంతో స్థానిక మధుమణి సమావేశ భవనంలో ఘనంగా నిర్వహించారు. ఇండియన్ అనస్థీషియా సొసైటీ నంద్యాల శాఖ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ అధ్యక్షతన, కార్యదర్శి డాక్టర్ మధుసూదన రెడ్డి నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నుకోబడ్డ రాజంపేటకు చెందిన డాక్టర్ బాలరాజు, ఐఎంఏ నంద్యాల శాఖ అధ్యక్షులు డాక్టర్ మధుసూదనరావు లు విశిష్ట అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. నంద్యాలలో ఉన్న అనస్థీషియా వైద్యులు అనస్థీషియా పితామహుడు విలియం థామస్ గ్రీన్ మార్టన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ.. 1846 అక్టోబర్ 16వ తేదీ అమెరికా మాసచూసేట్స్ నగరంలో




**అనస్థీషియా పై ప్రజా అవగాహన కరపత్రం ఆవిష్కరించిన నంద్యాల అనస్థీషియా వైద్యులు.**

విలియం థామస్ గ్రీన్ మార్టన్ మొట్టమొదటిసారిగా మత్తుమందు అనస్థీషియా ఇచ్చి ఆపరేషన్ చేయడం జరిగిందని అందువలన అక్టోబర్ 16 ప్రపంచవ్యాప్తంగా అనస్థీషియా దినోత్సవం నిర్వహిస్తున్నారు అని తెలిపారు.వైద్య రంగ పురోగతిలో అనస్థీషియా వైద్యుల దే కీలక పాత్ర అని అన్నారు. డాక్టర్ మధుసూదన రెడ్డి మాట్లాడుతూ నంద్యాలలో దాదాపు 30 మంది అనస్థీషియా వైద్యులు సేవలు అందిస్తున్నారని తద్వారా ఎంతో క్లిష్టమైన శస్త్ర చికిత్సలు కూడా నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా నంద్యాలలోనే ప్రజలు చేయించుకోవడానికి ఆస్కారం ఏర్పడిందన్నారు. డాక్టర్ బాలరాజు, డాక్టర్ మధుసూదనరావు మాట్లాడుతూ అనస్థీషియా రంగంలో వచ్చిన వినూత్న మార్పులు,ఉపయోగిస్తున్న అధునాతన పరికరాలు వైద్య ఆరోగ్య రంగాన్ని ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రభావితం చేసిందన్నారు. ఈ సందర్భంగా నంద్యాల మొట్టమొదటి అనస్థీషియా వైద్యులు డాక్టర్ రవికృష్ణ, సీనియర్ అనస్థీషియా వైద్యులు శాంతిరాం వైద్య కళాశాల ప్రొఫెసర్లు డాక్టర్ శేష ఫణి, డాక్టర్ మధుసూదన రెడ్డి, మహిళా అనస్థీషియా వైద్యులలో సీనియర్ అయిన డాక్టర్ మాధవీ లను ఐఎంఏ నంద్యాల శాఖ తరపున ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా" ఆపరేషన్ థియేటర్ బయట అనస్థీషియా వైద్యుల పాత్ర" పై డాక్టర్ నాగరాజా రెడ్డి,"అనస్థీషియా రంగంలో కృత్రిమ మేధ వినియోగంపై " డాక్టర్ రవితేజ మల్టీమీడియా సహకారంతో ప్రసంగించారు. సదస్సులో ప్రసంగించిన వీరికి ఐఎంఎ నంద్యాల జ్ఞాపికలు ఇచ్చి అభినందించారు.







ఈ కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ విజయభాస్కర రెడ్డి, సీనియర్ వైద్యులు డాక్టర్ సహదేవుడు, ఐఎంఏ నంద్యాల శాఖ అధ్యక్షులు డాక్టర్ మధుసూదనరావు,కార్యదర్శి డాక్టర్ పనీల్ కుమార్, అధిక సంఖ్యలో నంద్యాల వైద్యులు పాల్గొన్నారు.

# దీపావళి ముందురోజు ధనత్రయోదశి

## బంగారం వెండి కొనుగోళ్లపై ఉత్తరాదిలో నమ్మిక

న్యూఢిల్లీ, **అక్టోబర్ 17,ఆంధ్ర ప్రగతి:**
ధంతేరస్... దీపావళి పండుగకు ముందు త్రయోదశి నాడు వస్తుంది. ఆశ్వయుజ బహుళ త్రయోదశి నాడు ధంతేరస్ పర్వదినం జరుపుకుంటారు. అందుకే ధంతేరస్‌ను ధనత్రయోదశి అని కూడా పిలుస్తారు. ఈ ఏడాది అక్టోబర్ 18న శనివారం ధంతేరస్ వచ్చింది. ధంతేరస్‌తోనే దీపావళి పండుగ వేడుకలు మొదలవుతాయి. ఐదు రోజుల పాటు సాగుతాయి. అంతేకాదు.. దీపావళికి ముందు వచ్చే ఈ త్రయోదశిని ధంతేరస్.. ధన త్రయోదశి.. చోటీ దీపావళి అంటారు. ఇక ధంతేరస్‌ను ధనలక్ష్మిని ఆరాధించే పవిత్రమైన రోజుగా అభివర్ణిస్తారు. భక్తుల కోరికలను తీర్చడానికి 'అదృష్ట లక్ష్మి'
తనను పూజించే ప్రతి ఇంటికీ ఈ రోజు అతిథిగా విచ్చేస్తుందన్నది ఒక నమ్మకం. అందుకే ఈ పండుగ రోజు బంగారం, వెండి వంటి వస్తువులు కొనుగోలు చేయడం శుభప్రదమని ప్రజల విశ్వాసం. ధనత్రయోది రోజున కొంచెంకానీ బంగారం, వెండి కొనుగోలు చేస్తుంటారు ప్రజలు. ఇక వ్యాపారులు కొత్త ఒప్పందాలు చేసుకోవాలన్నా, నూతన వ్యాపార లావాదేవీలకు శ్రీకారం చుట్టాలన్నా, పెట్టుబడులు పెట్టాలన్నా 'ధన్‌తేరస్' అనువైన రోజుగా భావిస్తారు. ఒక్క మాటలో చెప్పాలంటే ధంతేరస్‌ను 'అదృష్ట లక్ష్మి' అతిథిగా వచ్చే రోజుగా భావిస్తారు. ధన త్రయోదశి అంటే సంపద, శ్రేయస్సు పెంచే త్రయోదశి అని అర్థం. ధంతేరస్ నాడు ధన్వంతరికి, కుబేరుడితోపాటు లక్ష్మీదేవికి పూజలు చేస్తారు. దేవదానవులు సముద్ర మధనం చేస్తున్న వేళ.. ధన్వంతరి భగవానుడి చేతిలో కలశంతో దర్శనం ఆచ్చారని అంతా నమ్ముతారు.



మరి కొన్ని చోట్ల అపమృత్యు నివారణ కోసం దీపాలను వెలిగించడం సంప్రదాయం. ధనత్రయోదశినే కొన్ని ప్రాంతాల్లో 'యమ త్రయోదశి' అని కూడా పిలుస్తారు. ఈ రోజున సాయంత్రం భక్తులందరూ లక్ష్మీదేవిని పూజిస్తారు. ఇంటి చుట్టూ దీపాలు వెలిగించి లక్ష్మీదేవిని ఆరాధిస్తారు. ఈ పూజలో భాగంగా గోధుమ, పెసలు, మినుములు, కందులు, బార్లీ .. మొదలైన వాటిని అమ్మవారికి సమర్పిస్తారు. అలాగే అపమృత్యు నివారణ కోసం నూనెతో దీపం వెలిగిస్తారు. దీనినే 'యమదీపం' అని కూడా అంటారు. దంతేరస్ నాడు బంగారం, వెండి.. విలువైన ఆభరణాలను కొనుగోలు చేస్తే కలిసిరావడంతోపాటు శుభప్రదం అని చెబుతారు. ఇది సంపద, అదృష్టాన్ని తెస్తుందని నమ్ముతారు. ఈ రోజు ఏం కొనుగోలు చేసినా రెట్టింపవుతుందని విశ్వాసం. అందుకే ఈ పర్వదినం నాడు బంగారం, వెండితోపాటుగా ఇంట్లోకి అవసరమైన ఇతర వస్తువులను కూడా కొనుగోలు చేస్తారు. బంగారం, వెండి వస్తువులతోపాటు వెండి లక్ష్మి, గణెళిశుడి విగ్రహాలను కొనుగోలు చేయవచ్చు. చీపురును లక్ష్మీదేవి రూపంగా పరిగణిస్తారు. ఈ రోజు చీపురు కొనడంతో పేదరికం, కష్టాలు, అనారోగ్య సమస్యలతోపాటు ఆర్థిక ఇబ్బందులు తొలగిపోతాయని ప్రతీతి. వాహనం కొనడం కూడా శ్రేయస్కరమే. అయితే పెరుగుతున్న బంగారం, వెండిలతో ప్రజల్లో ఆందోళన నెలకొంది.

# భగ్గుమంటున్న బంగారం ధరలు

## అందనంతగా రోజురోజుకూ పెరుగుదల

## ఏకంగా 3వేలు పెరిగిన తులం బంగారం ధర


హైదరాబాద్, **అక్టోబర్ 17,ఆంధ్ర ప్రగతి:**



బంగారం భగభగమండుతోంది. సామాన్యులను ఊరిస్తున్న పుత్తడి సంపన్నులనూ సవాల్ చేస్తున్నది. కనీవినీ ఎరుగని రీతిలో రికార్డుల్ని బద్దలుకొడుతున్న పసిడి ధరలు.. రాకెట్ వేగంతో పైపైకి పరుగులు పెడుతున్నాయి. ఏకంగా రూ.1.40 లక్షల వైపుకు దూసుకెళ్తోంది. ధనత్రయోదశి కి ఒక్కరోజు ముందు బంగారం ధరలు భారీగా పెరిగాయి. శుక్రవారం ఒక్కరోజే ఏకంగా రూ.3 వేలకుపైనే పెరిగింది. ఫలితంగా తులం బంగారం రూ.1.35 లక్షలు దాటి సరికొత్త రికార్డు సృష్టించింది. మార్కెట్ వర్గాల ప్రకారం.. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో శుక్రవారం ఉదయం 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,35,250గా నమోదైంది. 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,21,725కి చేరుకుంది. ఇక కిలో వెండి ధర రూ.1,81,000 వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో అతివిలువైన లోహాల ధరలు రాకెట్ వేగంతో దూసుకుపోతుండటం వల్లనే దేశీయంగా బంగారం ధరలు గరిష్ట స్థాయికి చేరుతున్నాయని మార్కెట్ వర్గాలు తెలిపాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ పడిపోతుండటం, అమెరికా ప్రభుత్వం షట్‌డౌన్ ఎత్తివేతపై అనిశ్చితి, రాజకీయ ఉద్రిక్త పరిస్థితులు,
ఫెడరల్ బ్యాంక్ వడ్డీరేట్లను తగ్గించనుండటం, చైనా-అమెరికా మధ్య టారిఫ్‌లు కూడా ధరలు దూసుకుపోవడానికి ప్రధాన కారణాలుగా పేర్కొంటున్నాయి. మదుపరులు తమ పెట్టుబడులను సురక్షితమైన బంగారం వైపు మళ్లించడం కూడా ఓ కారణంగా చెబుతున్నారు.
అంతేకాదు, ధనత్రయోదశి. ఈ రోజున బంగారం, వెండి కొనుగోళ్లు శుభప్రదమని దేశంలోని మెజారిటీ ప్రజల విశ్వాసం. బంగారం కొనుగోలు చేస్తే సంపద, అదృష్టాన్ని తెస్తుందని నమ్ముతారు. ఆరోజు బంగారం కొనుగోళ్లు ఊపందుకుంటాయి. ఇది కూడా ధరల పెరుగుదలకు కారణంగా తెలుస్తోంది.

# బిసి బంద్‌కు జాగృతి సంపూర్ణ మద్దతు

## ఆర్ . కృష్ణయ్య లేఖపై కవిత వెల్లడి





హైదరాబాద్, **అక్టోబర్ 17,ఆంధ్ర ప్రగతి:**
:బీసీ బంద్‌కు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని జాగృతి అధ్యక్షురాలు కవిత ప్రకటించారు. బీసీల రిజర్వేషన్ల కోసం తాను పోరాడతానని ఉద్ఘాటించారు. బంద్ ఫర్ జస్టిస్ పేరుతో 18వ తేదీన బీసీ సంఘాలు బంద్‌కి పిలుపునిచ్చాయి. బీసీ రిజర్వేషన్లు ఆమోదించాలంటూ బీసీ సంఘాలు ఆందోళన నిర్వహించనున్నాయి. ఈ క్రమంలో బీసీల బంద్‌కు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మద్దతు తెలపాలని తెలంగాణ బీసీ జేఏసీ చైర్మన్ ఆర్.కృష్ణయ్య లేఖ రాశారు. అయితే, ఆర్. కృష్ణయ్య లేఖపై స్పందించారు కవిత. తెలంగాణ అసెంబ్లీ, కౌన్సిల్ పాస్ చేసిన బిల్లులను ఆమోదించకుండా నెలల తరబడి పెండింగ్‌లో పెట్టిన బీజేపీ ఇప్పుడు బంద్‌లో పాల్గొంటోందని... అంటే బీసీ రిజర్వేషన్ల బిల్లులు పాస్ చేసినట్లు భావించాలా..? అని ప్రశ్నించారు. అసెంబ్లీ, కౌన్సిల్‌లో బిల్లులు పాస్ చేసి కేంద్ర ప్రభుత్వంపై కొట్లాడకుండా బీసీ రిజర్వేషన్లపై ఉత్తుత్తి జీవో ఇచ్చిన కాంగ్రెస్ తామే ముందుండి బంద్ చేయిస్తామనడం హాస్యాస్పదంగా ఉందని కవిత విమర్శించారు.

# ఉత్తరాంధ్రలో గుడివాడ.. సెంట్రల్ ఆంధ్రాలో జోగి..

# వైసీపీలో మరెవరికి పట్టదా?

విజయవాడ **అక్టోబర్ 17,ఆంధ్ర ప్రగతి:**
ఏపీ రాజకీయాలను ఇప్పుడు రెండే అంశాలు తీవ్ర ప్రభావితం చేస్తున్నాయి. అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధానికి కారణమవుతున్నాయి. అందులో ఒకటి విశాఖలో గూగుల్ భారీ పెట్టుబడి అయితే మరొకటి మునకలచెరువు నకిలీ మద్యం కేసు. ప్రస్తుతం ఈ రెండింటి చుట్టూ రాజకీయం తిరుగుతోంది. రూ.1.36 లక్షల కోట్ల భారీ పెట్టుబడితో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు కానుందని, దీనివల్ల లక్షా 80 వేల ఉద్యోగాలు రానున్నాయని ప్రభుత్వం చెబుతోంది. అదే సమయంలో అటు నకిలీ మద్యం కేసులో వైసీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేష్ ను కార్నర్ చేస్తోంది. అయితే ఈ రెండు అంశాలపై వైసీపీ నుంచి పెద్ద సౌండ్ వినిపించడం లేదని అభిప్రాయం వ్యక్తమవుతోంది.
విశాఖ గూగుల్ సెంటర్ పై ప్రభుత్వం ఆర్భాటంగా ప్రచారం చేసుకుంటోంది. విశాఖ ముఖచిత్రం మారిపోవడమే కాకుండా, ఏపీ గ్రోత్ ఇంజిన్ గా విశాఖ తయారు అవుతుందని, వికసిత్ భారత్ లక్ష్యాలను చేరుకోవడానికి కూడా ఉపయోగపడుతుందని ప్రభుత్వం చెప్పుకుంటోంది. గత ప్రభుత్వంలో పరిశ్రమలను తరిమేశారని భారీ ఎత్తున విమర్శలు గుప్పించిన కూటమి నేతలు.. నేడు రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు వెల్లువలా తరలివస్తున్నాయని చాటుతున్నారు. ఈ ప్రచారంతో వైసీపీ శ్రేణులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ఇంతటి భారీ పెట్టుబడలు వచ్చినట్లు చెప్పుకోలేక సతమతమవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తెరపైకి వచ్చిన మాజీ మంత్రి గుడివాడ అమరనాథ్.. ప్రభుత్వ మాటల దాడితో ఉక్కిరిబిక్కిరి అవుతున్న వైసీపీ శ్రేణులకు కాస్త ఊపిరి లూదారు. భారీ పెట్టుబడి రావడాన్ని వ్యతిరేకించలేని పరిస్థితుల్లో ఉన్న వైసీపీ.. ఇందులో కొన్ని కీలక అంశాలను లేవనెత్తి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని ప్రయత్నం చేసింది. 'గూగుల్ డేటా సెంటర్' వల్ల కేవలం 200 ఉద్యోగాలు






మాత్రమే వస్తాయని, ప్రభుత్వం చెబుతున్నట్లు 1.80 లక్షల ఉద్యోగాలు ఎలా వస్తాయో చెప్పాలని మాజీ మంత్రి అమరనాథ్ ప్రశ్నించడం తీవ్ర చర్చకు దారితీసింది. అయితే ఆయన విమర్శలపై ప్రతిదాడి ప్రారంభించిన అధికారపక్షం ముప్పేట చుట్టుముట్టింది. 'గుడ్డు' మంత్రికి ఏం తెలుసంటా? అమరనాథ్ ను టార్గెట్ చేసింది. అయితే ఈ సమయంలో అమరనాథ్ లేవనెత్తిన అంశాలపై మరికొందరు వైసీపీ నేతలు కూడా స్పందిస్తే ప్రభుత్వం వివరణ ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడేదని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. కానీ, వైసీపీ నుంచి ఏ ఒక్కరూ గూగుల్ విషయంలో మాట్లాడే సాహసం చేయకపోవడంతో అమరనాథ్ ఒంటరి అయినట్లు కనిపిస్తోందని విశ్లేషిస్తున్నారు. ఇదే పరిస్థితి సెంట్రల్ ఆంధ్రాలో మాజీ మంత్రి జోగి రమేష్ ఎదుర్కొంటున్నట్లు చెబుతున్నారు. నకిలీ మద్యం కేసులో జోగి రమేష్ చుట్టూ ఉచ్చు బిగించేలా ప్రభుత్వం పావులు కదుపుతున్నా, ఆయనకు మద్దతుగా ఏ వైసీపీ నేత మాట్లాడటం లేదని ఎత్తిచూపుతున్నారు.
ఇలాంటి సమయంలో పార్టీ సీనియర్లు కల్పించుకుని మాట్లాడితే బాగుండేదని వైసీపీ శ్రేణులు సూచిస్తున్నాయి. కానీ, వైసీపీలో నెంబర్ టు లీడర్ దగ్గర నుంచి మాజీ ఎమ్మెల్యేల వరకు ఏ ఒక్కరూ ప్రస్తుత రాజకీయ పరిణామాలపై స్పందించకపోవడం అంతుచిక్కడం లేదని అంటున్నారు. పార్టీ ఓడిపోయిన నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతోందని అంటున్నారు. ఎవరు ఇబ్బందుల్లో పడితే వారే డిఫెండ్ చేసుకోవాల్సివస్తుందని, వారిని సేవ్ చేయాల్సిన పార్టీ సీనియర్లు చేష్టలుడిగి చూస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. దీనివల్ల టీడీపీ కూటమి నేతలదే పైచేయి అవుతోందని అంటున్నారు.

# మీ అబ్బాయికి ప్రమాదం జరిగింది

## వృద్ధురాలిని మోసం చేసి 35లక్షలు మాయం



హైదరాబాద్, **అక్టోబర్ 17,ఆంధ్ర ప్రగతి:**:డిజిటల్ యుగం కావడంతో దొంగలు.. సైబర్ కేటుగాళ్ల అవతారం ఎత్తారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాల సంఖ్య బాగా పెరిగిపోతోంది. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా మన అకౌంట్లను ఖాళీ చేస్తున్నారు. చదువుకున్న వాళ్లు, వృద్ధులు, మహిళలు, యువకులు ఇలా అన్ని వర్గాల వారిని సైబర్ నేరగాళ్లు మోసం చేస్తున్నారు. 'మీ కొడుక్కి ప్రమాదం జరిగిందంటూ' తాజాగా ఓ మహిళ నుంచి లక్షల్లో డబ్బులను సైబర్ నేరగాళ్లు కాజేశారు. హైదరాబాద్ నగరంలో 61 ఏళ్ల వృద్ధురాలు నివాసం ఉంటుంది. ఆమె కొడుకు లండన్ నగరంలో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో తాజాగా స్టీవ్ అనే వ్యక్తి ఆ పెద్దావిడకు వాట్సాప్ కాల్ చేశాడు. తాను లండన్ లో వైద్యుడిగా పని చేస్తున్నాను అంటూ పరిచయం చేసుకున్నాడు. లండన్ విమానాశ్రయంలో ఆమె కుమారుడికి ప్రమాదం జరిగిందని, తలకు బలమైన గాయమైందని సైబర్ నేరగాళ్లు చెప్పారు. అంతేకాక లగేజ్ మిస్ అవ్వడంతో ఎలాంటి ఐడెంటిటీ లేదని, ఆసుపత్రిలో వైద్యులు చేర్చుకోవట్లేదని చెప్పిన నేరగాళ్లు ఆమెను భయపెట్టారు. దీంతో ఎలాగైనా తన కుమారుడికి చికిత్స అందించాలని విడతల వారీగా రూ. 35.23లక్షలు వృద్ధురాలు ఆ కేటుగాళ్లకు పంపింది. తన కొడుకు ఎలా ఉన్నాడో చూసేందుకు ఫొటో, వీడియో పంపించాలని కోరగా.. కాల్ చేసిన వ్యక్తి అందుకు ఒప్పుకోలేదు. అనుమానం వచ్చిన బాధితురాలు కుమారుడి నెంబర్ కు కాల్ చేసింది. తాను క్షేమంగా ఉన్నానని, ఎలాంటి ప్రమాదం జరగలేదని చెప్పడంతో మోసపోయానని గ్రహించిన వృద్ధురాలు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

---------------

# పీపీపీ మోడల్‌లో మెడికల్ కళాశాలల నిర్మాణం

## వైద్యరంగం అభివృద్ధికి మంచి అవకాశం -ఎలాంటి నష్టం లేదన్న మంత్రి సత్యకుమార్

విజయవాడ **అక్టోబర్ 17,ఆంధ్ర ప్రగతి:**
పీపీపీ మోడల్‌లో మెడికల్ కళాశాలల నిర్మాణం వల్ల నష్టం లేదని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మరోసారి స్పష్టం చేశారు. వైసీపీ అసత్య ప్రచారంతో రాద్ధాంతం చేస్తుందని మండిపడ్డారు. మెడికల్ కళాశాలలను అందుబాటులోకి తెస్తే ప్రజలకు మంచి జరుగుతుందని వెల్లడించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. 33 యేళ్ల తరువాత మళ్లీ ప్రభుత్వానికి ఆ కళాశాలు చెందుతాయని.. మెడికల్ కళాశాలలు పూర్తి అయితే 1500 సీట్లు వస్తాయని.. ఇందులో 725 సీట్లు పూర్తిగా ఉచితమని ప్రకటించారు. ఎన్టీఆర్ వైద్య సేవల కింద కార్పొరేట్ ఆస్పత్రిలో వైద్యం అందిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు మంచి చేయాలనే అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రజలకు ప్రతి చోటా మెరుగైన సౌకర్యాలు కల్పించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు మంత్రి. జగన్మోహన్ రెడ్డి ఇప్పుడు ఏదో మాట్లాడుతూ అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం



వ్యక్తం చేశారు. 108, 104లను ప్రైవేటు వ్యక్తులతో నడిపారని గుర్తుచేసిన మంత్రి.. మెడికల్ కళాశాలలను ప్రైవేటు పార్టనర్ షిప్‌తో చేస్తే తప్పేంటి అని ప్రశ్నించారు. అసెంబ్లీ కి రా చర్చిద్దాం అంటే వచ్చే ధైర్యం లేదని విమర్శించారు. రిషికొండలో వందల కోట్లు తో భవనాలు నిర్మించారని.. మరి ఈ మెడికల్ కళాశాలలు ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. ప్రజలు చదువకుండా యువత మేదో సంపత్తిని జగన్ నాశనం చేశారని మండిపడ్డారు. నర్సీపట్నంలో మెడికల్ కళశాలను జగన్ నిర్మించలేదని.. ఐదు వందల కోట్లు అయితే జగన్ ఖర్చు పెట్టింది ఇరవై కోట్లు మాత్రమే అని తెలిపారు. మెడికల్ కళాశాలకు ఆయన ఇచ్చే నిర్వచనం ఏమిటో జగన్‌కే అర్థం కాదంటూ దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాతే ఈ మెడికల్ కాలేజీల నిర్మాణ పనులు మొదలయ్యాయని పేర్కొన్నారు. ప్రజలను తక్కువ అంచనా చేసిన జగన్‌కు తగిన గుణపాఠం చెప్పారని.. అయినా ఇంకా పాత పద్ధతిలోనే జగన్ వెళుతున్నారని విమర్శించారు. సెల్ఫ్ ÷నాన్స్ స్కీం తెచ్చింది జగనే అని.. ఇప్పుడు ఆయనే విమర్శిస్తున్నారని అన్నారు. బీజేపీ అధికార ప్రతినిధులపై గురుతర బాధ్యతలు ఉన్నాయన్నారు. ఏ అంశం మాట్లాడినా ఆ విషయంపై పరిజ్ఞానం పెంచుకోవాలని సూచించారు. ఆగ్రహం, ఆనందం, ఆవేదన అయినా మీడియా సమావేశాల్లో, సభల్లో ముఖంలో కూడా కనిపించాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు.

# తిరుపతి కలెక్టరేట్‌కు బాంబు బెదిరింపు




తిరుపతి,**అక్టోబర్ 17,ఆంధ్ర ప్రగతి:**: తిరుపతి కలెక్టరేట్‌ను బాంబులతో పేల్చేస్తామంటూ గుర్తు తెలియని వ్యక్తుల నుంచి బెదిరింపు మెయిల్ వచ్చింది. దీంతో రంగంలోకి దిగిన బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందం కలెక్టరేట్‌లోని వివిధ విభాగాలు, పరిసర ప్రాంతాలను పరిశీలించింది. కలెక్టర్ ఛాంబర్‌తో పాటు కార్యాలయంలోని వివిధ శాఖలకు చెందిన గదులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత ఎలాంటి పేలుడు పదార్థాలు లేవని నిర్ధరించారు. తిరుపతి కలెక్టర్ కార్యాలయ అధికారిక మెయిల్‌కు తమిళనాడు నుంచి బెదిరింపు మెయిల్ వచ్చినట్టు గుర్తించారు. గడచిన 15 రోజులుగా బాంబు బెదిరింపుల మెయిల్స్ వరుసగా రావడం కలకలం రేపుతోంది.

# ఎల్లమ్మ సినిమా హీరోగా దేవిశ్రీప్రసాద్

### కోడై కూస్తున్న సోషల్ మీడియా



బలగం వేణు నిర్మించనున్న ఎల్లమ్మ సినిమాకు అరుదైన హీరో దొరికాడు. బలగం వంటి సూపర్ సక్సెస్ తర్వాత వేణు ఎల్లమ్మ అనే మరో చిత్రాన్ని తెరకెక్కించేందుకు సిద్ధమైన విషయం తెలిసిందే. దిల్ రాజు ఈ సినిమాను నిర్మిస్తోండగా ఎడాదిన్నరగా హీరో విషయంలో తర్జన భర్జనలు జరుగుతూ ఉన్నాయి. నాని, నితిన్, శర్వానంద్, నిఖిల్, బెల్లంకొండ శ్రీనివాస్ ఇలా నలుగురైదుగురు పేర్లు తెరమీదకు వచ్చి పోవడం జరిగిపోయాయి. ఇక కథానాయికల విషయంలోనూ సాయి పల్లవి, కీర్తి సురేశ్‌ల మధ్యే చర్చలు నడుస్తున్నట్లు వార్తలు ఎప్పటినుంచో ఉన్నాయి. అయితే.. తాజాగా ఈ స్థానంలోకి సంగీత దర్శకుడు దేవీ శ్రీ ప్రసాద్ పేరు రావడం సినీ లవర్స్‌ను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఇప్పుడు ఈ వార్త సోషల్ మీడియాలో ఓ రేంజ్‌లో హల్‌చల్ చేస్తోంది. అంతేగాక ఈ సినిమాకు దేవీనే సంగీతం కూడా అందించనున్నట్లు సమాచారం.ఇప్పటికే డ్యాన్స్, నటనలోనూ దేవీకి అద్భుత ప్రతిభ ఉంది. అయితే ఈ వార్తల విషయంలో ఇప్పటివరకు అధికారిక ప్రకటన అయితే లేదు. మేకర్స్ , దర్శకుడు వేను, దిల్ రాజు, దేవీ శ్రీ ప్రసాద్ స్వయంగా స్పందిస్తే తప్ప ఈ వార్తలపై క్లారిటీ రాదు. ఇదిలాఉంటే.. కుమారి 21ఎఫ్ సినిమా సమయంలో దేవి శ్రీ ప్రసాద్‌ని నా ఎస్వీసీ బ్యానర్ లో సుకుమార్ దర్శకత్వంలో హీరోగా పరిచయం చేస్తాను అని దిల్ రాజు గతంలోనే మాట ఇచ్చాడు. కానీ దశాబ్దం గడిచినా అది ముందుకు పడలేదు. ఇప్పుడు ఈ చిత్రంతో అటు వేణు, ఇటు డీఎస్పీ ఇద్దరిని కలిపి సినిమా తీస్తే దిల్ రాజు ఇచ్చిన మాట కూడా నేరవేరినట్లే అవుతుందని టాక్ వినిపిస్తోంది. అయితే ఎల్లమ్మ సినిమా విషయంలో ఎలాంటి వార్తలు వస్తాయో ఎదురు చూడాలి.

# సామ్రాజ్యం ప్రోమో విడుదల చేసిన ఎన్టీఆర్

తమిళ అగ్ర హీరో శిలంబరసన్ టీఆర్ అలియాస్ శింబు హీరోగా జాతీయ అవార్డు దర్శకుడు, క్రియేటివ్ జీనియస్ వెట్రిమారన్ తెరకెక్కిస్తున్న చిత్రం అరసన్. తెలుగులో సామ్రాజ్యం పేరుతో రానుంది. తాజాగా ఈ చిత్రం ప్రోమోను యంగ్ టైగర్ ఎన్టీఆర్ ఎక్స్ ద్వారా శుక్రవారం ఉదయం విడుదల చేశారు. ఇంకా షూటింగ్ పూర్తిగా పట్టాలెక్కని ఈ చిత్రం ఉత్తర చెన్నై నేపథ్యంలో గ్యాంగ్‌స్టర్ కథతో రూపొందుతుండగా అనిరుధ్ సంగీతం అందిస్తున్నాడు. తాజాగా విడుదల చేసిన ప్రోమో 4 నిమిషాలకు పైగా ఉండడమే గాక చూస్తే చాలా రా అండ్ రస్టిక్ లాగా ఉంది. హత్యా నేరం అభియోగంతో కోర్టుకు వచ్చిన హీరో జడ్జి ముందు నాకేమీ తెలియదు నన్ను ఇరికించారు అని చెబుతూనే మరో వైపు యంగ్ హీరో ముగ్గురిని నరికి చేతులు కడిగే సన్నివేశాలను ప్రజెంట్ చేశారు. బ్యాగ్రౌండ్ స్కోర్ కూడా బాగానే ఉంది. ప్రోమో ఆరంభఃలో జైలర్ దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ ఎంట్రీ అతనితో హీరో మాట్లాడే డైలాగ్స్ అదిరిపోయాయి. ముఖ్యంగా నా స్టోరీని ఎవరితో చేపిద్దామనుకుంటున్నారు.. ఎన్టీఆర్‌తో చేపించండి కుమ్మేస్తాడు అంటూ శింబ ఉచెప్పే డైలాగ్ ఆకట్టుకునేలా ఉంది. గతంలో వెట్రిమారన్, ధనుష్ కాంబోలో వచ్చిన వడ చెన్నై సినిమాను యూనివర్స్‌గా మార్చి అందులో ఓ పార్ట్‌గా ఈ సినిమాను తీసుకు వస్తున్నారు. ఇదిలాఉంటే ఈ చిత్రంలో సమంత, కీర్తి సురేశ్, సాయి పల్లవిలు ముగ్గురిలో ఇద్దరు కథానాయికలుగా చేయనున్నట్లు తెలుస్తోంది.




# 650 కోట్లను దాటేసిన కాంతారా

కన్నడ నటుడు రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో వచ్చిన కాంతార చాప్టర్ 1 చిత్రం బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతుంది. ఇప్పటికే ఇప్పటికే రూ.650 కోట్లను అలవోకగా దాటి బాహుబలి ది బిగినింగ్ రికార్డును బద్దలుకొట్టిన ఈ చిత్రం తాజాగా గదర్ 2 రికార్డును అధిగమించింది. గదర్ 2 చిత్రం వరల్డ్ వైడ్‌గా రూ.700 కోట్ల వసూళ్లను సాధించగా.. ఈ రికార్డును చెరిపివేస్తూ.. కాంతార రూ.717 కోట్లతో దూసుకుపోతుంది. దీంతో దేశంలో అత్యధిక వసూళ్లు సాధించిన టాప్-20 చిత్రాల్లో కాంతార 16వ స్థానానికి ఎగబాకింది. 2025లో అత్యధిక కలెక్షన్లు సాధించిన సినిమాల్లో రెండో ప్లేస్ దక్కించుకుంది. ఈ సినిమాలో రుక్మిణి వసంత్ కథానాయికగా నటించగా గుల్షన్ దేవయ్య, జయరాజ్ కీలక పాత్రల్లో నటించారు.








## దీపాల వెలుగుల్లో మరింత అందంగా బుట్టబొమ్మ!

మేడం సార్
మేడమ్ అంతే అని
పూజా హెగ్డేను ఇందుకే అంటారు
కావచ్చు.. తాజాగా పూజా హెగ్డేకి సంబంధించి హాట్ ఫోటోస్ వైరలవుతున్నాయి. పూజా హెగ్డే తాజాగా దివాళి సందర్భంగా బాలీవుడ్ ఫిలిం ప్రొడ్యూసర్ రమేష్ తౌరాణి ఇచ్చిన దివాలీ పార్టీలో మెరిసింది. ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా రమేష్ తౌరాణి దీవాలీ పార్టీ కోసం ఎంతోమంది బాలీవుడ్ సెలబ్రిటీలను ఆహ్వానించారు. అలా ఈ పార్టీకి ఎంతోమంది బాలీవుడ్ సెలబ్రిటీలు వచ్చారు. అందులో భాగంగానే ఈ పార్టీకి పూజా హెగ్డే కూడా వెళ్ళింది. ఈ పార్టీలో రెడ్ కలర్ డ్రెస్ లో పూజా హెగ్డే అందాలు ఆరబోసింది. స్లీవ్ లెస్ డ్రెస్ తో పార్టీలో ఉన్న అందరిలో స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచింది. అయితే ఈ ఫోటోలను పూజా హెగ్డే తన ఇంస్టాగ్రామ్ ఖాతాలో కూడా షేర్ చేసింది. అంతేకాదు దీపావళి మొత్తం ఇక్కడే ఉంది అన్నట్లుగా "దివాళి ఇస్ హియర్" అని క్యాప్షన్ ఇచ్చింది. పూజా హెగ్డే ని ఈ డ్రెస్ లో చూడడానికి రెండు కళ్ళు చాలడం లేదు అంటూ ఈ ఫోటోలు చూసినా అభిమానులు మైమరచిపోతున్నారు.చాలామంది ఈ ఫోటోలు చూసి రెడ్ మిర్చిలా హాట్ హాట్ గా ఉన్నావు.. గార్జియస్ అద్భుతంగా ఉన్నావు..రెడ్ డ్రెస్ లో నిన్ను చూస్తుంటే మా మతిపోతుంది అంటూ చాలామంది ఫైర్ ఎమోజిస్ తో కామెంట్లు పెడుతున్నారు. ఈ రెడ్ కలర్ డ్రెస్ లో పూజా హెగ్డే ఆత్మవిశ్వాసం మరింత రెట్టింపు అయ్యింది..రెడ్ డ్రెస్ లో బుట్ట బొమ్మలా కనిపిస్తున్న పూజ హెగ్డే ని అలా చూస్తూ ఉండిపోతున్నారు ఫాలోవర్స్. అంతేకాకుండా తన రొమాంటిక్ లుక్ తో స్మైలింగ్ ఫేస్ తో చూసే వాళ్లందర్నీ తన చూపుతోనే కట్టిపడేస్తుంది. ఈ డ్రెస్సు లో పూజ హెగ్డే ఫ్యాషన్ తో పాటు ట్రెడిషన్ ని కూడా ఎంత ఫాలో అవుతుందో అర్థం చేసుకోవచ్చు.గ్లామర్ గా కనిపించడంతోపాటు ట్రెడిషన్ ని ఫాలో అవుతూ పూజ హెగ్డే వేసుకున్న డ్రెస్సు పై చాలా మంది కాంప్లిమెంట్స్ ఇస్తున్నారు. అలా ఎప్పుడూ సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా ఉండే పూజ హెగ్డే తాజా స్టైలిష్ ఫోటోలకి మాత్రం చాలా మంది అభిమానులు ఫిదా అయిపోతున్నారు. ఇక గత కొద్ది రోజులుగా చూసుకుంటే పూజ హెగ్డే కెరియర్ కాస్త డౌన్ ఫాల్ అయింది అని చెప్పుకోవచ్చు. వరుస ఫ్లాపుల వల్ల ఆమె కెరియర్ కాస్త ఇరుకున పడింది. ఈ హీరోయిన్ ఈ మధ్యనే రజినీకాంత్ కూలీ మూవీలో మోనికా అనే స్పెషల్ సాంగ్ చేసింది. ఈ సాంగ్ ఇంటర్నెట్ లో ఎంత వైరల్ అయిందో చెప్పనక్కర్లేదు. కూలీ మూవీతో మళ్లీ సినిమాలలో బిజీ అయిపోయిన పూజ హెగ్డే చేతిలో రెండు మూడు సినిమాలు ఉన్నాయి. అలా దుల్కర్ సల్మాన్ తో చేస్తున్న లవ్ స్టోరీ మూవీతో పాటు రాఘవ లారెన్స్ కాంచన 4 లో కూడా నటిస్తోంది. అలాగే బాలీవుడ్ లో హై జవానీ తో ఇష్క్ హెూనా హై అనే మూవీలో కూడా చేస్తుంది..

# 'జటాధర' ట్రైలర్..

## ఇది ధన పిశాచి ఆట

టాలీవుడ్ నవ దళపతి సుధీర్ బాబు ఎప్పుడు విభిన్న కథలు, వైవిధ్యమైన పాత్రలు ఎంచుకుంటారన్న విషయం తెలిసిందే. ఇప్పుడు సూపర్ నేచురల్ థ్రిల్లర్ మూవీ జటాధరలో యాక్ట్ చేస్తున్నారు. థ్రిల్లర్ అంశాలతో.. డివోషనల్ టచ్ బ్యాక్ డ్రాప్ తో రూపొందుతున్న ఆ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే మేకర్స్ రిలీజ్ చేసిన పోస్టర్స్, లుక్స్, సాంగ్స్, టీజర్ మంచి రెస్పాన్స్ అందుకున్నాయి. ఆడియన్స్ లో సూపర్ బజ్ క్రియేట్ చేశాయి. ఇప్పుడు ఆ జోష్ తో మేకర్స్.. ట్రైలర్ ను శుక్రవారం సాయంత్రం తీసుకొచ్చారు. సూపర్ స్టార్ మహేష్ బాబు చేతుల మీదుగా సోషల్ మీడియాలో ట్రైలర్ ను రిలీజ్ చేయించారు మేకర్స్. గూస్ బంప్స్ తెప్పించే సీన్స్ తో ట్రైలర్ స్టార్ట్ అవ్వగా.. బ్యాక్ గ్రౌండ్ లో ఆసక్తి రేపే డైలాగ్ వచ్చింది. పూర్వం ధనాన్ని భూమిలో దాచి పెట్టి మంత్రాలతో బంధనాలు వేసేవారు. వాటిలో భయంకరమైనది పిశాచి బంధనం అంటూ బాలీవుడ్ బ్యూటీ సోనాక్షి సిన్హాను చూపించారు మేకర్స్. ఈ సినిమాతో ఆమె టాలీవుడ్ లోకి వస్తోంది. ఆ తర్వాత సుధీర్ బాబు స్టైలిష్ లుక్ లో ఎంట్రీ ఇచ్చారు. పారానార్మల్ కార్యకలాపాలను నమ్మని పారానార్మల్ పరిశోధకుడిగా కనిపించారు. ధన పిశాచి మేల్కొన్నాడని తెలుసుకుని ఆమెను ఆపడానికి మార్గాలు కనుగొనడం ప్రారంభిస్తారు. దెయ్యాలను వేటాడే హీరో.. అతడి చుట్టూ జరిగే ధన పిశాచి ఆట.. ఇదే మూవీగా తెలుస్తోంది. అయితే సుధీర్ బాబు మరోసారి తన నటనతో ఆకట్టుకునేలా కనిపిస్తున్నారు. శివుని త్రిశూలంతో నడిచేటప్పుడు భక్తుడిగా, ఆ తర్వాత స్టైలిష్ లుక్స్ తో ఆకట్టుకున్నారు. ట్రైలర్ చివరి సీన్ తో గూస్ బంప్స్ తెప్పించారు. సోనాక్షి సిన్హా.. జటాధర మూవీలో సరికొత్త పాత్రలో ప్రేక్షకులను మెస్మరైజ్ చేసేందుకు సిద్ధమయ్యారని తెలుస్తోంది.




# తండ్రి అయ్యాక లుక్ మార్చిన మెగాహీరో

మెగా హీరో వరుణ్ తేజ్ సినిమాల పరంగా కాస్త ఒడిదొడుకులు ఎదుర్కొంటున్నాడు. అయితే వ్యక్తిగతంగా మాత్రం ఆయన ప్రేమించిన అమ్మాయిని వివాహం చేసుకుని వైవాహిక జీవితంలో చాలా సంతోషంగా ఉన్నాడు. ఇటీవలే తండ్రి అయిన వరుణ్ తేజ్ పూర్వ ఉత్తేజంతో సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అవుతున్నాడు. గత నెలలో వరుణ్ తేజ్ భార్య లావణ్య త్రిపాఠి కొడుకుకు జన్మనిచ్చింది. ఇటీవలే దసరా సందర్భంగా వరుణ్ తేజ్ దంపతులు తమ కొడుకుకి వాయువ్ తేజ్ కొణిదెల అనే పేరు పెట్టారు. కొడుకు పుట్టిన సమయంలో సినిమాలకు బ్రేక్ తీసుకున్న వరుణ్ తేజ్ తిరిగి షూటింగ్‌కు హాజరు కాబోతున్నాడు. తన తదుపరి సినిమాకు సంబంధించిన పనులతో, రాబోయే సినిమాల కోసం స్క్రిప్ట్ వింటూ వరుణ్ తేజ్ బిజీ బిజీ అయ్యాడు. ఈ సమయంలో ఆయన సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఈ పోటో వైరల్ అవుతోందివరుణ్ తేజ్ స్టైలిష్ లుక్ వైరల్ సాధారణంగానే వరుణ్ తేజ్ స్టైలిష్ లుక్‌లో కనిపిస్తూ ఉంటాడు. ఈసారి అంతకు మించి అన్నట్లుగా వరుణ్ తేజ్ అల్ట్రా మోడ్రన్ లుక్‌లో కనిపిస్తున్నాయి. క్లోజప్‌లో వరుణ్ తేజ్ ఏకంగా బాలీవుడ్, హాలీవుడ్ రేంజ్‌లో ఉన్నాడంటూ అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. గుబురు గడ్డం, మీసాలు, పెరిగిన జుట్టు, స్టైలిష్ గాగుల్స్, అంతకు మించి స్టైలిష్ ఔట్ ఫిట్‌లో వరుణ్ తేజ్‌ను చూస్తూ ఉంటే అలాగే చూస్తూ ఉండాలి అనిపిస్తుందని మెగా అభిమానులు సోషల్ మీడియాలో కామెంట్స్ చేస్తున్నారు.

